www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -198 సోమవారం 20 అక్టోబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## రాజ్యాంగ సవరణపై అసెంబ్లీలో తీర్మానం

- 'జూబ్లీ' ఎన్నికలపై బీజేపీ, బీఆర్ఎస్ చీలిక కుట్రలు
- వాటిని తెలంగాణ సమాజం తిప్పికొట్టాలి
- రిజర్వేషన్లు రాకపోవడానికి ఆ రెండు పార్టీలే కారణం
- చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావన
- యాత్ర సంస్మరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ గాంధీ సద్భావన అవార్డు ప్రదానం

2లో.

# తప్పులకు తావివ్వొద్దు


## సర్వేయర్లు బాధ్యతగా ఉండి రైతులకు సాయం చేయాలి

### కొంతమంది దొరల కోసమే ధరణిని తెచ్చారని తీవ్ర ఆరోపణ

- ధరణిని రద్దు చేసి భూ భారతిని తీసుకొచ్చామని వెల్లడి
- ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్న ముఖ్యమంత్రి
- రాష్ట్రం అభివృద్ధి కావాలంటే రైతు రాజు కావాలి : సీఎం రేవంత్

హైదరాబాద్**అక్టోబర్, 19,ప్రజావినికిడి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ధరణి చట్టమే ప్రధాన కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఒక్క చట్టం వల్లే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సర్వేయర్లకు లైసెన్సుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కొంతమంది దొరలు భూములపై పెత్తనం చెలాయించేందుకే



గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తమ పార్టీ గెలుపునకు చాలా కారణాలు ఉండవచ్చని, కానీ బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ధరణి మాత్రమే కారణమని ఆయన అన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరణి నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని గుర్తుచేశారు.మిగతా 2లో...

## కాంగ్రెస్ పాలనకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికే రెఫరెండర్

- రాష్ట్రంలో బుల్డోజర్ పాలన సాగుతోందని కేటీఆర్ విమర్శ
- కమీషన్ల కోసం కేబినెట్‌లోనే మంత్రులు గొడవపడుతున్నారని ఆరోపణ
- బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్న కేటీఆర్



హైదరాబాద్**అక్టోబర్, 19,ప్రజావినికిడి**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరగబోయే ఉపఎన్నిక, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు, శాంతిభద్రతల పరిస్థితికి, విశ్వసనీయతకు ఒక ప్రజా తీర్పు (రెఫరెండం) వంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కీలక అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేసి, ప్రజలపై బుల్డోజర్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన '420 హామీలు' ఇచ్చి ప్రజలను వంచించిందని, వారి నాటకాలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.మిగతా 2లో...

## నమ్మకానికి మారుపేరు యాదవులు

### రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తాం సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ :**అక్టోబర్, 19,ప్రజావినికిడి**


యాదవులు నమ్మకానికి మారుపేరు అని, మాట ఇస్తే కట్టుబడి ఉంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నమ్మినవారి కోసం ఎంత కష్టమొచ్చినా, నష్టమొచ్చినా అండగా నిలుస్తారని తెలిపారు. యాదవుల సహకారంతోనే హైదరాబాద్ ప్రపంచ పెట్టుబడులకు ఆదర్శనగరంగా మారిందని, నగరంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నామని చెప్పారు. మిగతా 2లో...



## జెఇఇ మెయిన్ షెడ్యూల్ విడుదల..

హైదరాబాద్ **అక్టోబర్, 19,ప్రజావినికిడి**

దేశంలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్(జెఇఇ) 2026 ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జనవరి 21 నుంచి 30 మధ్య తేదీల్లో తొలి విడత జెఇఇ మెయిన్ (సెషన్ 1), ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీల మధ్య సెషన్ -2 పరీక్షలు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) వెల్లడించింది.జెఇఇ మెయిన్ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతాయి. ఈసారి కూడా గతంలో మాదిరిగానే రెండు విడతల్లో జెఇఇ మెయిన్ నిర్వహించనున్నట్లు ఎన్‌టిఏ తెలిపింది.మిగతా 2లో...






# దావోస్ తరహాలో విశాఖ సదస్సు

## నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు

- విశాఖ సదస్సుపై సీఎం చంద్రబాబు కొత్త వ్యూహం...
- కేవలం ఒప్పందాలకే కాకుండా, విధానాల రూపకల్పనపై చర్చించాలి
- దావోస్ తరహాలో మేధోమథనానికి వేదికగా సదస్సు నిర్వహణ
- గూగుల్ రాకతో విశాఖ 'హ్యాపెనింగ్ సిటీ'గా మారిందని వ్యాఖ్య
- ఏపీ టూ ఏఐ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచన
- సదస్సులో ఏపీ వనరులు, అవకాశాలపై ప్రత్యేక ప్రజంటేషన్



అమరావతి **అక్టోబర్, 19 , ప్రజావినికిడి**

విశాఖపట్నం వేదికగా నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సును సరికొత్త పంథాలో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సదస్సు కేవలం పెట్టుబడుల ఒప్పందాల (ఎంఓయూ)కే పరిమితం కాకుండా, రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే విధానాల రూపకల్పనపై విస్తృత మేధోమథనానికి వేదిక కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచ ప్రఖ్యాత దావోస్ సదస్సు తరహాలో ఇక్కడ కూడా పెట్టుబడిదారులు, విధానకర్తల మధ్య ఫలవంతమైన చర్చలు

మిగతా 2లో...



## వస్తువుల ధరలు తగ్గాయా

- విజయవాడ బీసెంట్ రోడ్ లో సీఎం చంద్రబాబు సర్ ప్రైజ్ విజిట్..
- చిరు, వీధి వ్యాపారులతో నేరుగా ముఖాముఖి
- జీఎస్టీ తగ్గింపు ప్రభావంపై ఆరా
- వస్తువుల ధరలు తగ్గాయా అని వ్యాపారులకు ప్రశ్న
- కొనుగోలుదారులతోనూ మాట్లాడిన ముఖ్యమంత్రి

2లో.

# కేంద్ర సహకారంతోనే ఏపీకి గూగుల్

- ఆస్ట్రేలియాలో నారా లోకేశ్ పర్యటన 0సిడ్నీలో తెలుగు డయాస్పొరాతో సమావేశం
- ఏపీకి గూగుల్ సిటీ రావడం వెనుక కేంద్రం సహకారం ఉందని వెల్లడి
- పవన్‌తో కలిసి 15 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించడమే లక్ష్యం అంటూ వ్యాఖ్యలుస
- గూగుల్ ఎంత ముఖ్యమో.. ఎంఎస్ఎంఈలు కూడా అంతే ముఖ్యమని స్పష్టీకరణ

అమరావతి **అక్టోబర్, 19,ప్రజావినికిడి**

రాష్ట్రానికి 'గూగుల్ ఏఐ డేటా సెంటర్' రావడం వెనుక కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో ఉందని, సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోక్యంతోనే ఇది సాధ్యమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తాను గూగుల్ సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు రావాలని కోరినప్పుడుమిగతా 2లో...



## ప్రజల మధ్య చిచ్చు పెడతారు జాగ్రత్త

- తెలుగు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు...
- 'నయా నరకాసురుల'ను ప్రజలు ఓడించారంటూ పవన్ కీలక వ్యాఖ్యలు
- ఓటమి అక్కసుతో కొందరు ప్రజల మధ్య చిచ్చు పెట్టే యత్నం చేస్తున్నారని ఆరోపణ
- అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపు

అమరావతి **అక్టోబర్, 19,ప్రజావినికిడి**

దీపావళి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.మిగతా 2లో...





## నన్ను జైలుకు పంపాలన్నదే చంద్రబాబు లక్ష్యం

- నకిలీ మద్యం కేసులో ఏ విచారణకైనా సిద్ధమన్న జోగి రమేశ్
- లై డిటెక్టర్ పరీక్షకు కూడా తాను సిద్ధమని ప్రభుత్వానికి సవాల్
- తనను జైలుకు పంపడమే లక్ష్యంగా ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపణ
- ఇదంతా చంద్రబాబు ఆడుతున్న దృష్టి మళ్లించే రాజకీయమంటూ విమర్శ

2లో.

# కేంద్ర సహకారంతోనే ఏపీకి గూగుల్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర చట్టాల్లో కొన్ని సవరణలు అవసరమని వారు చెప్పారని గుర్తుచేశారు. ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్ ద్వారా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడి ఆ చట్టాలను సవరించేలా చేశారని లోకేశ్ వివరించారు. ఈ కేంద్ర ప్రభుత్వ చొరవతోనే గూగుల్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఏపీకి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ప్రాంగణంలోని బ్రూవర్స్ పెవిలియన్ నోబుల్ డైనింగ్ రూమ్‌లో ఏపీఎన్ఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన ఆస్ట్రేలియా తెలుగు డయాస్పోరా సమావేశానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక విషయాలను పంచుకున్నారు.

**కేంద్ర సహకారంతోనే రాష్ట్ర ప్రగతి**

కేవలం గూగుల్ మాత్రమే కాకుండా, కొప్పర్తి నోడ్, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్, ఎన్టీపీసీ గ్రీన్ ప్రాజెక్ట్, నక్కపల్లి ఫార్మాసిటీ వంటి అనేక కీలక ప్రాజెక్టులు కూడా కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతోనే రాష్ట్రంలో రూపుదిద్దుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఆర్సెల్లర్ మిట్టల్ ప్రాజెక్ట్ విషయంలోనూ కేంద్రం ఇలాగే సహకరించిందని, ఒక్క జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను అనకాపల్లికి తీసుకురాగలిగామని అన్నారు. తనకు గూగుల్ వంటి పెద్ద సంస్థలు ఎంత ముఖ్యమో, మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కూడా అంతే ముఖ్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

**పవన్‌తో కలిసి 15 ఏళ్ల ప్రయాణం**

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో తమ పొత్తు ఎంతో స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. పొత్తుల్లో చిన్న చిన్న సమస్యలు సహజమే అయినా, రాబోయే 15 ఏళ్ల పాటు కలిసికట్టుగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్నదే తమ ఉమ్మడి లక్ష్యమని పవన్ పదేపదే చెబుతున్నారని గుర్తుచేశారు. గత ఐదేళ్ల పాలనలో పీపీఏలు, ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల రాష్ట్రం, దేశం తీవ్రంగా నష్టపోయాయని, ఆ చేదు అనుభవం పునరావృతం కాకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని నంబర్ 1 స్థానంలో నిలపడమే తమ ఏకైక అజెండా అని, తెలుగువారు మళ్లీ గర్వంగా తలెత్తుకునే రోజులు తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ప్రవాసాంధ్రులే మన బ్రాండ్ అంబాసిడర్లు**

విదేశాల్లో స్థిరపడిన తెలుగువారంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. “మీరు మీ కంపెనీలలో రాష్ట్రం గురించి మాట్లాడితే, నా కన్నా మార్కెటింగ్ సులభంగా జరుగుతుంది. ఏదైనా కంపెనీ భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే మా దృష్టికి తీసుకురండి, ఆ డీల్ పూర్తి చేసే బాధ్యత మేం తీసుకుంటాం” అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని, ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో పాలుపంచుకోవాలని కోరారు. ప్రవాసాంధ్రుల పెట్టుబడులకు మద్దతుగా ఏపీఎన్ఆర్‌టీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, దానిని ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చారు.ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో ఉన్న తెలుగువారికి, ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు ఏపీఎన్ఆర్‌టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని లోకేశ్ తెలిపారు. అనంతరం ప్రవాసాంధ్రులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడ్నీలోని భారత కాన్సులేట్ జనరల్ డాక్టర్ ఎస్. జానకీ రామన్, ఏపీఎన్ఆర్‌టీఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ వేమూరి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# దావోస్ తరహాలో విశాఖ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

జరగాలని స్పష్టం చేశారు. ఆదివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఉన్నతాధికారులు, ఈడీబీ అధికారులతో కలిసి సదస్సు నిర్వహణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “సానుకూల పారిశ్రామిక విధానాలు ఉన్నప్పుడే వాణిజ్యం, పరిశ్రమలు పెట్టుబడులతో ముందుకు వస్తాయి. అప్పుడే రాష్ట్రంలో సంపద సృష్టి సాధ్యమవుతుంది. విశాఖ సదస్సును కేవలం పెట్టుబడులు ఆకర్షించే కార్యక్రమంగా చూడవద్దు. ఇది విజ్ఞానాన్ని పంచుకునే, భవిష్యత్ ప్రణాళికలను చర్చించుకునే ఒక మేధోమథన వేదికగా నిలవాలి” అని అన్నారు. ప్లీనరీ, బ్రేక్‌అవుట్ సెషన్ల ద్వారా వివిధ రంగాలపై లోతైన చర్చలు జరిగితే పరిశ్రమలకు, ప్రభుత్వానికి, అంతిమంగా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఏపీ టూ ఏఐ నినాదంతో ముందుకు**

రాష్ట్రంలో ఇటీవల గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో డేటా ఏఐ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామమని చంద్రబాబు పేర్కొన్నారు. “గూగుల్ రాకతో విశాఖ నగరం ఒక హ్యాపెనింగ్ సిటీగా మారింది. ఈ స్ఫూర్తితో రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి చిరునామాగా మార్చాలి. ‘వన్ ఫ్యామిలీ వన్ ఏఐ’ తరహాలో ‘ఏపీ టూ ఏఐ’ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి” అని అధికారులకు సూచించారు. ఈ సదస్సులో ఏఐ ఫర్ గుడ్, సెమీ కండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత, డ్రోన్లు, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి భవిష్యత్ తరహా అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆదేశించారు.

వీటితో పాటు లాజిస్టిక్స్ రంగంలో రహదారులు, అంతర్గత జలరవాణా, కోల్డ్ స్టోరేజీలు, అగ్రిటెక్, రేర్ ఎర్త్ మినరల్స్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలను కూడా చర్చనీయాంశాలుగా చేర్చాలని స్పష్టం చేశారు. సదస్సుకు దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు, ప్రముఖ విద్యాసంస్థల ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ సదస్సును ఒక అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంగా ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.

సదస్సులో రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులు, పెట్టుబడి అవకాశాలను వివరిస్తూ ప్రత్యేక ప్రజంటేషన్ సిద్ధం చేయాలని, 21వ శతాబ్దం భారత్‌దే అనే స్ఫూర్తిని అది ప్రతిబింబించేలా ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధుల కోసం హోం స్టే వసతి కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించడం గమనార్హం.

# నన్ను జైలుకు పంపాలన్నదే చంద్రబాబు లక్ష్యం

అమరావతి **అక్టోబర్, 19,ప్రజావినికిడి**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలపై వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కేసులో తన పేరును ఇరికిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కేసులో తాను ఎలాంటి విచారణకైనా సిద్ధమని, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకు కూడా వస్తానని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. తనను అన్యాయంగా జైలుకు పంపాలనే ఏకైక లక్ష్యంతోనే ఈ కుట్ర జరుగుతోందని మండిపడ్డారు.

మీడియాతో మాట్లాడిన జోగి రమేశ్, ప్రభుత్వంపై పలు సూటి ప్రశ్నలు సంధించారు. “నకిలీ మద్యం కేసులో నన్ను ఇరికించాలని చూస్తున్నారు. నేను ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నాను. మీరు చెప్పిన చోటికి లై డిటెక్టర్ పరీక్షకు కూడా వస్తాను. కానీ, ఈ కేసులో మీరు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు చాలా ఉన్నాయి” అని అన్నారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌ను ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేసి పిలిపించి, అతనితో బలవంతంగా తన పేరు చెప్పించిందని ఆరోపించారు. అసలు పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడి వీడియో బయటకు ఎలా లీక్ అయిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జనార్దన్, జయచంద్రారెడ్డి స్నేహితులని స్వయంగా చంద్రబాబే గతంలో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మద్యం వ్యాపారంతో సంబంధం ఉన్న వ్యక్తికి టీడీపీ టికెట్ ఎలా ఇచ్చిందని జోగి రమేశ్ నిలదీశారు. “తంబళ్లపల్లె నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డికి మద్యం వ్యాపారం ఉందని మీకు తెలియదా? తెలిసీ అతనికి టికెట్ ఎలా ఇచ్చారు? దీని వెనుక ఎలాంటి సూట్‌కేస్ ఒప్పందాలు జరిగాయి?” అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో నిజాయతీ ఉంటే చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మంచి నీటి కుళాయిల కంటే బెల్టు షాపులే ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ మద్యం పాలసీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. ఈ కేసులో తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి తాను ఎక్కడైనా ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని జోగి రమేశ్ స్పష్టం చేశారు. “నేను తిరుమల వెంకన్న లేదా బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో ప్రమాణం చేస్తాను. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటికి వచ్చి అయినా ప్రమాణం చేయడానికి సిద్ధం. నాపై బురద జల్లాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని దుర్మార్గమైన రాజకీయాలు చేయడం మానుకోవాలి” అని హితవు పలికారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించలేకపోతే చంద్రబాబు, లోకేశ్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాజ్యాంగ సవరణపై అసెంబ్లీలో తీర్మానం

ధూల్‌పేట**అక్టోబర్, 19,ప్రజావినికిడి**

పద్దెనిమిది ఏండ్లకే ఓటు హక్కును కల్పించి దేశ అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అదే స్ఫూర్తితో 21 ఏండ్లకే శాసనసభ్యుడిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ రాజ్యాంగ సవరణ తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. దానిపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని అన్నారు. హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షిద్‌కి ”రాజీవ్ గాంధీ సద్భావన అవార్డు”ను ప్రదానం చేశారు.

అనంతరం సీఎం మాట్లాడుతూ దేశంలో గాంధీ అనే పదం భారతదేశానికి పర్యాయపదం అనీ, గాంధీ కుటుంబం దేశానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఇందిరా గాంధీ ప్రాణాలర్పించారనీ, దేశం కోసం మూడు తరాలు ప్రాణాలర్పించిన చరిత్ర గాంధీ కుటుంబానిదన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆనాడు రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేశారనీ, ఆయన స్ఫూర్తిని కొనసాగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సల్మాన్ ఖుర్షీద్‌కి రాజీవ్ సద్భావన అవార్డ్ అందించడం అందరికీ గర్వకారణం అన్నారు.

రాజీవ్ స్ఫూర్తితో రాహుల్ గాంధీ దేశ సమగ్రత కోసం భారత్ జోడో యాత్ర చేశారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్‌గా మారిందనీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందం జరిగిందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 21 శాతం బీఆర్ఎస్ ఓట్లు ఎవరికి చేరాయనీ, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అదే చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఓట్లు చీల్చాలని ఇప్పటి నుంచే కుట్ర చేస్తున్నారన్నారనీ, ఈ కుట్రలను తెలంగాణ సమాజం తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాకపోవడానికి కూడా ఆ రెండు పార్టీలే కారణమన్నారు. ఈ కుట్రలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణను అభివృద్ధివైపు నడిపిద్దామని అన్నారు.

**సెక్యులరిజానికి కట్టుబడ్డ కాంగ్రెస్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

మతసామరస్యానికి గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ అంకిత భావంతో పని చేసిందనీ, సెక్యులరిజానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 35 ఏండ్లుగా నిరంజన్ నేతత్వంలో రాజీవ్ గాంధీ సద్భావన స్మారకోత్సవం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కాంగ్రెస్ 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందనీ, కొన్ని న్యాయపరమైన చిక్కులు ఎదురైనా అమలు చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం అన్నారు.

ఈ రిజర్వేషన్ల ప్రక్రియను అడ్డుకుంటున్నదెవరో చైతన్యవంతమైన సభ్య సమాజం గుర్తించాలన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారోకోత్సవ సభలకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారులు హర్కు వేణుగోపాల్ రావు, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మెన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మధ్య చిచ్చు పెడతారు జాగ్రత్త

ఈ సందర్భంగా ఆయన పరోక్షంగా రాజకీయ ప్రత్యర్థులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘నయా నరకాసురులను’ ప్రజలు ప్రజాస్వామ్య యుద్ధంలో ఓడించారని, అయితే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలుగు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు! దీప కాంతులతో శోభాయమానంగా… సంప్రదాయబద్ధంగా నిర్వహించుకొనే పండుగ దీపావళి. తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు. మన భారతదేశంలో చేసుకొనే ప్రతీ పండుగకీ ఒక పరమార్థం ఉంది. మనకు జీవన శైలిని నేర్పుతుంది. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించుకుంటాం. దీపావళి స్ఫూర్తితో నయా నరకాసురులను ప్రజాస్వామ్య యుద్ధంలో ప్రజలందరూ కలసి ఓడించారు. ఈ నరకాసురులు మారీచుల్లాంటివారు. రూపాలు మార్చుకొంటూ వస్తారు. తమను ఓడించారనే అక్కసుతో.. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, అశాంతి రేకెత్తించే కుట్రలకు దిగుతున్నారు. కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండి.. ఇలాంటి నయా నరకాసురులకు, వారి అనుచర గణానికి ఎప్పటికప్పుడు గుణపాఠం చెప్పాలి. ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. ఈ వేడుకల్లో టపాసులు కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను” అంటూ పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## వస్తువుల ధరలు తగ్గాయా

**విజయవాడ బీసెంట్ రోడ్ లో సీఎం చంద్రబాబు సర్ ప్రైజ్ విజిట్..**





**అక్టోబర్, 19,ప్రజావినికిడి**

ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎంతవరకు మేలు చేస్తోంది? ఈ ప్రయోజనాలు సామాన్యులకు అందుతున్నాయా? ఈ విషయాలను స్వయంగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా జనంలోకి వెళ్లారు. ఆదివారం ఆయన విజయవాడలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన బీసెంట్ రోడ్‌ను సందర్శించి, అక్కడి వ్యాపారులు, కొనుగోలుదారులతో ముఖాముఖిగా సంభాషించారు.

నగర పర్యటనలో భాగంగా, ముఖ్యమంత్రి బీసెంట్ రోడ్‌లోని పలువురు చిరు వ్యాపారులు, వీధి వర్తకులు, జనరల్ స్టోర్ల యజమానులు, చెప్పుల దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. జీఎస్టీని తగ్గించడం వల్ల వస్తువుల ధరలు వాస్తవంగా తగ్గాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ నిర్ణయంతో వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి, ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోందనే వివరాలను వారి నుంచి సేకరించారు.అదే సమయంలో, షాపింగ్ కోసం బీసెంట్ రోడ్‌కు వచ్చిన కొందరు కొనుగోలుదారులను కూడా ముఖ్యమంత్రి పలకరించారు. ధరల తగ్గుదల వారికి ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తోందనే దానిపై వారి అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నేరుగా తమ వద్దకు వచ్చి మాట్లాడటంతో వ్యాపారులు, స్థానికులు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

## కాంగ్రెస్ పాలనకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికే రెఫరెండర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా రద్దు చేసేందుకు వారికి మరింత ధైర్యం వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. “కాంగ్రెస్‌ను ఓడిస్తేనే, కనీసం కొన్ని హామీలైనా నెరవేర్చాలనే ఒత్తిడి వారిపై ఉంటుంది” అని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో బుల్డోజర్ పాలన, పరిపాలనా గందరగోళం నెలకొన్నాయని కేటీఆర్ ఆరోపించారు. కేవలం ప్రచార ఆర్భాటాలు తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రజా ప్రయోజన కార్యక్రమాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. “కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హైదరాబాద్ పురోగతి, తెలంగాణ సమగ్రాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయాయి” అని ఆయన పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. సరైన రాజ్యాంగబద్ధమైన కసరత్తు లేకుండా చేసిన ప్రకటనలు కోర్టుల్లో నిలబడలేకపోయాయని అన్నారు. బీసీల సాధికారతపై కాంగ్రెస్, బీజేపీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయాలని ఆయన సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జాతీయ పార్టీలు చేసే ఎలాంటి నిజాయతీ ప్రయత్నానికైనా రాజ్యసభలో బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.కేబినెట్‌లోని మంత్రులు కమీషన్ల కోసం, అంతర్గత ఆధిపత్యం కోసం పోరాడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. “మేడారం జాతర పనుల నుంచి టెండర్ల కేటాయింపుల వరకు ప్రతి విషయంలో మంత్రులు వ్యక్తిగత లాభం కోసమే గొడవ పడుతున్నారు. కేబినెట్‌లోనే మంత్రులు ఇలా కమీషన్ల కోసం కొట్టుకుంటుంటే, ఇక రాష్ట్రాన్ని ఎవరు పాలిస్తారు?” అని ఆయన ప్రశ్నించారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ ముఖ్యమంత్రి హైదరాబాద్ భవిష్యత్తుపై నీళ్లు చల్లారని ఆయన విమర్శించారు. ప్రజా రవాణాను పక్కనపెట్టి, కాంగ్రెస్ నేతల భూముల విలువ పెంచడానికే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

## నమ్మకానికి మారుపేరు యాదవులు

(మొదటి పేజీ తరువాయి)

దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటులో, అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో సదర్‌ను పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం వచ్చాక సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించి నిధులు అందిస్తున్నామని చెప్పారు. వైఎంసీఏలో 1985లో ప్రారంభమైన సదర్ నుంచి ఇప్పటివరకు తాను ఉత్సవంలో పాల్గొంటున్నానని, యాదవోంకా ఖదర్.. హైదరాబాద్ సదర్ అని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల సహకారం ఎంతో అవసరమని, సంక్షేమం, రాజకీయ రంగంలో వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ఏ సమస్య ఉన్నా.. ప్రభుత్వం వద్దకు రావాలని, అన్ని సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు.

## తప్పులకు తావివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఆ మాట ప్రకారమే, అధికారం చేపట్టిన వెంటనే ధరణిని రద్దు చేసి ‘భూ భారతి’ అనే కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వివరించారు.ఉద్యోగ నియామకాల విషయంలోనూ గత ప్రభుత్వంపై సీఎం విమర్శలు గుప్పించారు. వారి హయాంలో టీజీపీఎస్సీ ఓ పునరావాస కేంద్రంగా మారిందని, ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో లీక్ అయ్యేవని ఆరోపించారు. కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. కొందరు కావాలనే కోర్టుల్లో కేసులు వేసి నియామక ప్రక్రియను అడ్డుకుంటున్నారని, అయినప్పటికీ న్యాయపోరాటం చేసి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. త్వరలోనే గ్రూప్-3, గ్రూప్-4 నియామకాలు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా, లైసెన్సులు పొందిన కొత్త సర్వేయర్లను సీఎం అభినందించారు. చరిత్రలో భూమి కోసమే ఎన్నో యుద్ధాలు జరిగాయని, సర్వేలో చిన్న తప్పు జరిగినా ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. సర్వేయర్లందరూ బాధ్యతాయుతంగా పనిచేసి, రైతులకు అండగా నిలవాలని ఆయన సూచించారు.

## జెఇఇ మెయిన్ షెడ్యూల్ విడుదల..

(మొదటి పేజీ తరువాయి)

జెఇఇ మెయిన్ సెషన్ -1 పరీక్షకు ఈ నెల నుంచే ఆన్‌లైన్ దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. సెషన్ -2 పరీక్షకు జనవరి ఆఖరి వారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యేలా పరీక్ష నిర్వహించే సిటీల సంఖ్యను పెంచేందుకు కృషిచేస్తున్నామని.. దివ్యాంగ అభ్యర్థుల అవసరాలను తీర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు పేర్కొంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 20 అక్టోబర్ 2025

## కన్స్యూమర్ ఆక్టివిటీస్ ఆధ్వర్యంలో షాద్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కు వినతి పత్రం అందజేత



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణ చౌరస్తాలో అభం,శుభం తెలియని చిన్నారులను భిక్షాటనకు అలవాటు చేయడం గురించి మనవి.చేయు మనవి ఏమనగా మేము ఉజ్వల కన్స్యూమర్ ఎంపవర్మెంట్ అండ్ ప్రొటెక్షన్ అసోసిమేషన్ సభ్యులము,మీకు విజ్ఞప్తి చేయునది ఏమనగా మన షాద్ నగర్ చౌరస్తులో కొంతముంది మహిళలు భిక్షాటన చేస్తున్నరు.పెద్ద వాళ్ళు,మైనారిటీ తీరిన వారు తమ వృత్తిని ఎంచుకోవడంలో ఎలాంటి అభ్యంతరము లేదు కాని వారితో పాటు అభం శు భం తెలియని చిన్నారులను,భావి భారత పౌరులను భిక్షాటునకు అలవాటు చేయడం దురదృష్టకరం మరియు విచారకరం. వీరిని కౌన్సిలింగ్ చేయడానికి మేము మీ సహాయం కోరుచున్నాము..కన్స్యూమర్ ఆక్టివిస్టులు.దిద్దిగోపాల్ నారాయణ,రంగన్న గౌడ్,రవీందర్ రెడ్డి,ప్రవీణ, మల్లేష్,తోట శివశంకర్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఒకటే పనిని ఎన్నిసార్లు చేస్తారు మున్సిపల్ అధికారులు.

### ప్రజల సొమ్ము దుర్వినియోగం..

### బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**మున్సిపాలిటీ పరిధిలో సరిగ్గా 3 నెలల క్రితం కొత్త రోడ్డు వేస్తామని ఆగ మేఘాల మీద ఫరూఖ్ నగర్ (జానంపేట)లోని ప్రభుత్వ హైస్కూల్ నుండి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు ప్రజల ఇండ్ల ముందు ఉన్న అరుగులను, రాంపులను,మెట్లను తొలగించి ఆ సందులలో కంకర డస్ట్ చిప్స్ కలిసిన మిశ్రమాన్ని నింపి వెంటనే రోడ్డు వేస్తామని నమ్మించి కాలయాపన చేస్తూ, రోడ్డు కాంట్రాక్టర్ మళ్ళీ గత మూడు రోజులుగా మళ్లీ ఆ సందులలో పోసిన కంకర డస్టును తొలగించి మళ్లీ కొత్త కంకర వేస్తామని మాట్లాడటం చేసిన పనిని మళ్ళీ మళ్ళీ చేయడం ప్రజల అసహనానికి గురవుతున్న పరిస్థితి అసలే దీపావళి పండుగ సమయం 3 నెలలుగా ఎక్కడ వేసిన కంకర అక్కడనే ఉండి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్న జానంపేట ప్రజలు ఇప్పటికే చాలా వరకు ఆ కంకర రాళ్లు టైర్ల కింద ఇరుక్కొని ఇతరులకు గాయాలవ్వడం,కార్లు బస్సుల అద్దాలు పగలడం రోజు చూస్తున్నాం అయినా కూడా ఎందుకు పనులు ఆలస్యం అవుతున్నాయో లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక అన్నట్టుగా ఉంది పరిస్థితి.కనీసం ఇప్పుడైనా రోడ్డు వేస్తారా లేక ఇంకా ప్రజల సహనాన్ని పరీక్షిస్తారా అని బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేశ్ అధికారులను అదేవిధంగా కాంట్రాక్టర్ ను ప్రశ్నిస్తున్నారు.

## జిల్లాస్థాయి కోకో క్రీడాకారుల ఎంపికలు..





**ప్రజావినికిడి,(కల్వకుర్తి): అక్టోబర్ 19,**కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్ లో జరుగుతున్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి 58వ కోకో క్రీడ కార్ల ఎంపిక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కోకో సెలక్షన్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వివిధ మండలాల నుంచి క్రీడ కారులో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు కోకో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం పాల్గొని క్రీడాకారులకు సలహాలు సూచనలు ఇచ్చారు.ప్రతిసారి జరిగే క్రీడల్లో గర్ల్స్ విభాగం నుంచి గోల్డ్ మెడల్ తీసుకొచ్చామని నెక్స్ట్ రాబోయే రోజుల్లో బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగంలో మొదటి బహుమతి తెస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం కల్వకుర్తి పట్టణంలో నిర్వహించడం చాలా సంతోషదాయకమని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గోకమళ్ళ రాజును అభినందించారు. కల్వకుర్తిలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టి విద్యార్థులను ప్రోత్సహించాలని, క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో ఉంటారని అన్నారు ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్గనైజర్ గోకమళ్ళ రాజు,తెలంగాణ ఉద్యమకారుడు కూన స్కైలాబ్,కల్వకుర్తి ప్రాంతంలోని పీడీలు పురణ్ చంద్ ప్రకాష్, జగన్,నిరంజన్ యాదవ్ పీఈటీలు, క్రీడ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకంతో తెలంగాణ ప్రజలకు

# ప్రభుత్వం దీపావళి కానుక..

### ప్రజల కోసం పనిచేయండి..ప్రభుత్వ ఆశయం నెరవేర్చండి..

### లైసెన్స్డ్ సర్వేయర్లకు మంత్రి పొంగులేటి సూచన..






**ప్రజావినికిడి,(హైదరాబాద్):** దశాబ్దాల తరబడి తీవ్ర అసంతృప్తితో ఉన్న తెలంగాణ రైతాంగానికి లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకను అందించిందని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం నాడు శిల్ప కళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్లు పంపిణీ చేసిన కార్యక్రమానికి మంత్రి పొంగులేటి అధ్యక్షత వహించి ప్రసంగించారు.గత ప్రభుత్వం ధరణి పేరిట చేసిన తప్పులను తమ ప్రభుత్వం సరిదిద్దే కార్యక్రమాన్ని చేపట్టిందని దీనిలో భాగంగా 3456 మందికి లైసెన్స్లు మంజూరు చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు నిరుద్యోగ యువతను దృష్టిలోపెట్టుకొని రెవెన్యూలో భాగమైన సర్వే వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఆలోచించి దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. దీనికి బీసీ.ఈబీసీ. ఎస్సీ ఎస్టీ తదితరాలకు చెందిన పదివేల మంది దరఖాస్తు చేసుకోగా ఏడువేల మందికి శిక్షణ ఇచ్చామని వీరిలో 3456 మంది క్షేత్రస్థాయిలో తర్ఫీదు పొంది ఎంపికయ్యారని వీరికి నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా లైసెన్స్లు అందజేస్తున్నామని వివరించారు.నాడు జీపీవో వ్యవస్థ,భూభారతి, సాదాబైనామాల తదతరాల విషయంలో అలక్ష్యం జరిగినందున సుమారు 9.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని వీటిని తమ ప్రజా ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందని అన్నారు.చిన్న అవకతవకలు జరగకుండా,ప్రజలకు వ్యతిరేకంగా పనిచేయకుండా ప్రజా, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి పొంగులేటి సర్వేయర్లను కోరారు.మీరు ఈ లైసెన్స్లు పొంది సంతోషించినట్లే



ప్రజలను కూడా మీ పనులతో సంతోషించేలా చేయాలని తద్వారా ప్రభుత్వానికి పేరుతేవాలని కోరుతూ లైసెన్స్డు సర్వేయర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

## శంషాబాద్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్..

# గులాబీ గూటికి హస్తం నేతలు..

### కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిన మాజీ ఎంపీపీ ఎల్లయ్య.. - పెద్ద షాపూర్ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్..





**ప్రజావినికిడి,(శంషాబాద్):అక్టోబర్ 19,**రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. శంషాబాద్ మండలంలో గట్టి పట్టున్న నాయకులు ఉమ్మడి రాష్ట్ర మాజీ మార్క్ ఫెడ్ వైస్ చైర్మన్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, శంషాబాద్ మండల మాజీ ఎంపీపీ,పెద్ద షాపూర్ మాజీ ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, పెద్ద షాపూర్ మాజీ సర్పంచ్ చేక్కల చంద్రశేఖర్ ముదిరాజ్ ఇతర మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు సొసైటీ డైరెక్టర్లు తదితర ఐదు వందల మంది అనుచర గణంతో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో



బీఆర్ఎస్ పార్టీలో చేరారు.దీంతో శంషాబాద్ కాంగ్రెస్ పార్టీలో భారీ కుదుపని చెప్పాలి.ఈ సందర్భంగా చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో వున్నారు.రైతు బంధు లాంటి పథకాలు ప్రజలో మంచి రోజులు తీసుకుని వచ్చాయని కొనియాడారు.నేడు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అయోమయంలో పడవేసినద ప్రప్రజ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ లో రాబోయ్యేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో చెక్కల చంద్రశేఖర్ పెద్దషాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, ప్రమోద్ పటేల్-సొసైటీ డెరైక్టర్,కంకరి నరసింహ-సొసైటీ డెరైక్టర్,తాళపల్లి గణేష్,మాజీ ఎంపిటిసి,ఇస్రా నాయక్,మాజీ సర్పంచ్,గొపాల్ నాయక్,మాజీ ఎంపిటిసి,బొద్దం నారాయణ యాదవ్ మాజీ ఉప సర్పంచ్,కేశంపేట మహేష్ యాదవ్ మాజీ ఉప సర్పంచ్,సురేష్ నాయక్ మాజీ ఉప సర్పంచ్ 500 మంది అనుచరులు తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారు.

## కానిస్టేబుల్ హత్యకేసులో నిందితుడి అరెస్ట్

**నిజామాబాద్ క్రైం :** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని సిసిఎస్ విభాగంలో పనిచేసే కానిస్టేబుల్ ప్రమోద్ను హత్య చేసిన నిందితుడు రియాజ్ను అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదివారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపూర్ ప్రాంతంలో రియాజ్ను అదుపులోకి తీసుకున్నారు. రియాజ్ను పట్టుకునే సమయం లో ఆసిఫ్ అనే వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఈ పెనుగులాటలో ఇద్దరికి గాయలయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్న రియాజ్ను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్కి సిసిఎస్ పోలీసులు తరలిస్తుండగా కానిస్టేబుల్ ప్రమోద్ ఛాతీలో పొడిచి రియాజ్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ప్రమోద్ పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఈ ఘటనను సీరియస్గా తీసుకున్న పోలీస్ శాఖ ఐజిని ప్రత్యేకంగా రంగంలోకి దింపింది.



ఈమేరకు సిపి సాయిచైతన్య పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. అనంతరం పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు చర్యల్లో భాగంగా రియాజ్ ఉన్నట్లు పోలీసులకు ప్రాథమిక సమాచారం అందింది. దీంతో ఓ ఎస్ఐ, కానిస్టేబుల్ కలిసి శనివారం రాత్రి ఆరో ఠాణా పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నిందితుడు రియాజ్ ఉపయోగించిన బైక్ స్థానిక కెనాల్ సమీపంలో లభించడంతో అతను కెనాల్లో నీటిలో దూకి పారిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానించారు. దీంతో డ్రోన్ల సాయంతో నిందితుడి కోసం జల్లెడ పట్టారు. అయినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం సారంగపూర్ శివారులో ఓ పాత లారీలో దాక్కుని ఉన్నట్లు గుర్తించి పట్టుకునే సమయంలో పరారయ్యాడు. అక్కడే ఉన్న నెహ్రూనగరానికి చెందిన ఆసిఫ్ అనే వ్యక్తిపై దాడి చేశాడు. ఈ మేరకు అతని చేతి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు అప్రమత్తమై నిందితుడు రియాజ్ను పట్టుకున్నారు. చికిత్స నిమిత్తం వీరిద్దరినీ ఆస్పత్రికి తరలించారు.

# ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం ఆవిర్భావం..

**రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయిల విస్తరించడానికి ఏర్పాట్లు.. ఆయుర్వేద మూలికా రహస్యాలు అనే పుస్తకం ఆవిష్కరణ..**

**ఆయుర్వేద పరంపర వైద్య జ్ఞానాన్ని ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చేయాలి..వ్యవస్థాపక అధ్యక్షులు మాచలం లక్ష్మణ స్వామి..**

**ప్రధాన కార్యదర్శిగా ఆచార్య హరీష్ దైవజ్ఞ,ఉపాధ్యక్షులుగా ఎనగందుల రవితేజ..**







**ప్రజావినికిడి,(కోరుట్ల):**
శ్రీ రమణానంద నంద యోగ పీఠం.. సిద్ధాశ్రమమ్,కోరుట్ల లోశ్రీ భగవాన్ ధన్వంతరి జయంతి ఉత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి.
ఈ కార్యక్రమంలో భాగంగాశ్రీ భగవాన్ ధన్వాంతరి పూజ సర్వరోగ నివారక ఆయుష్య ధన్వంతరి హోమం అరుదైన వనమూలికలతో అద్భుతంగా జరిగింది, అరుదైన వనమూలికలు నాటే కార్యక్రమంలో అత్యంత అరుదైన మొక్క ఏకబిల్వం మొక్కను ఆశ్రమంలో ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు హైదరాబాద్ వాస్తవ్యులు సింహాచలం లక్ష్మణ స్వామి స్వయంగా తీసుకువచ్చి నాటారు.అంతేకాదు సింహాచలం లక్ష్మణస్వామి ప్రదర్శించిన అరుదైన వనమూలికల చిత్ర ప్రదర్శన 100 మొక్కలకు పైగా ఉన్న భారీ వర్ణ చిత్ర ప్రదర్శన అందర్నీ ఆకర్షించింది అనేక ఔషధ మొక్కల వివరాలు స్పష్టమైన ఫోటోలు దాంట్లో ఉన్నాయి..అనంతరం లక్ష్మణస్వామి రచించిన అనుభవ ఆయుర్వేద మూలికా రహస్యాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు, ఉచితంగా అందించారు.దానిలో చాలా విలువైన మొక్కలైనా ఏకబిల్వం నల్లవావిలి ఇంకా ఇతర మొక్కల వివరాలు కూడా,వాడే విధానము మొక్కల పూర్తి వివరాలు ఔషధ ప్రయోజనాలు చాలా అద్భుతంగా ఆ ధన్వంతరి భగవంతుని ముఖచిత్రంతో చాలా అద్భుతంగా ప్రచురించి ఉచితంగా పుస్తకాన్ని లక్ష్మణ్ స్వామి సంఘం తరపున అందించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా ఆయుర్వేద పరంపరం మూలిక వైద్య మహా సంఘం రిజిస్ట్రేషన్ పూర్తి అయిన సందర్భంగా సంఘం ఆవిష్కరణ ఘనంగా జరిగింది.
ఈ సంఘంలో
వ్యవస్థాపక అధ్యక్షులు మాచలం లక్ష్మణ స్వామి,
ప్రధాన కార్యదర్శిగా ఆచార్య హరీష్ దైవజ్ఞ,
ఉపాధ్యక్షులుగా ఎనగందుల రవితేజ,
కోశాధికారిగా జిందం కమలాకర్,
జాయింట్ సెక్రటరీగా
ఎనగందుల హనుమాండ్లు, కార్యవర్గ సభ్యులుగా
చింతలపాటి జగన్ మోహన్ రాజు,
పడాల చంద్రశేఖర్ గౌడ్,
చింత దేవి దాస్,
కంటె లక్పతి,
మామిడిపల్లి కాంతయ్య,
మొదలగువారితో ఈ సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి, తెలియజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయుర్వేద జీవన విజ్ఞాన వికాసాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ఇకనుండి విశేష కృషి చేస్తామని
ప్రతి సభ్యుడు గౌరవంగా చట్టపరంగా తమ తమ విధులు నిర్వర్తించాలని ప్రతి ఒక్క సభ్యునికి అండదండగా సంఘం ఉంటుందని సంఘము ప్రతి జిల్లాకు విస్తరిస్తామని ప్రతి జిల్లాకు ప్రత్యేక ప్రతినిధులను తీసుకోవడం జరుగుతుందన్నారు.
ఇది రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయిల విస్తరించడానికి ఏర్పాట్లు కూడా చేశామని వివరించారు. ఈ సందర్భంగా
ప్రతి ఒక్క పరంపర వైద్యులు విధిగా ఔషధ మొక్కలు పెంచుకోవాలని నాటాలని పంచుకోవాలని జీవవైవిద్య సంస్థతో కూడా సమన్వయంతో వ్యవహరించాలని అటవీశాఖ తో కూడా సమన్వయంతో ఉండాలని ప్రతి ఒక్కరికి మొక్కలపైన కల్పించి వీలైతే అందజేసే ప్రయత్నం చేయాలని ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి కోసం ఆ భగవంతున్ని ప్రార్థించి మంచి జరగాలని ఆశించాలని అందరితో కలిసి మెలిసే ముందుకు వెళ్లి ఆయుర్వేద పరంపర వైద్య జ్ఞానాన్ని ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకురావడానికి ముఖ్యంగా పరంపర వైద్యులకు గుర్తింపు కోసం ఈ సంఘం కట్టబడి ఉందని అతి త్వరలోనే ఆ శుభవార్త కూడా ఉంటుందని ఎంతో విశ్వాసంతో లక్ష్మణ్ స్వామి మీడియాకు
వివరించారు. ఇక పరంపర వైద్యులకు మాహార్దశరాబోతుందని వారికి కచ్చితంగా మంచి గుర్తింపు దిశగా ప్రయత్నాలు జరగబోతున్నాయని ప్రతి ఒక్కరూ వైద్యులు ఈ సంఘంలో సభ్యులుగా నమోదు చేసుకుంటే ముందు ముందు భవిష్యత్తు కార్యాచరణలో వాళ్ళు కూడా బాధ్యులుగా ఉంటారని చాలా ఉపయోగకరంగా ఉంటుందని సంఘం నిర్వహించే అనేక కార్యక్రమాల గురించి అద్భుతంగా వివరించారు.అనేక కార్యక్రమాలు ఇక వరసగా ఉంటాయని తెలియజేశారు.కోరుట్ల ఆశ్రమంలో జరిగిన ధన్వంతరి జయంతి ఉత్సవాలు చాలా ఘనంగా అద్భుతంగా జరిగాయి కాబట్టి అనేక కార్యక్రమాలకు ఇందులో శ్రీకరం చుట్టబడితే ముఖ్యంగా సంఘం ఆవిర్భావం సందర్భంగా ధన్వంతరే జయంతి రోజే ఆవిర్భావం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడం సభ్యులు బాధ్యతలు స్వీకరించడం ఇందులో ప్రధాన ముఖ్య ఘట్టం అన్నారు.ఆయుర్వేద మూలికా రహస్యాలు అనే పుస్తకం ఆవిష్కరించడం ఇందులో ప్రధాన ఆకర్షణ నిలిచింది.
అరుదైన వనమూలికల వర్ణ చిత్ర ప్రదర్శన కూడా దీంట్లో హైలెట్గా నిలిచింది.ఇంకా ఈ కార్యక్రమంలో భగవాన్ శ్రీ ధన్వంతరి యొక్క చిత్రపటాన్ని ప్రేమ కట్టించి మరి సభ్యులకు వచ్చిన అందరికీ ఉచితంగా అందించారు స్వామి వారి ప్రసాదాలకు కూడా అందించారు.
ఈ కార్యక్రమంలో ధన్వంతరి పూజ హోమాలు ఇంకా అన్ని కార్యక్రమాలు దివిజంగా ఎంతో అద్భుతంగా శ్రమ కూర్చు నిర్వహించిన ప్రధాన కార్యదర్శి ఆచార్య హరీష్ దైవజ్ఞ ని లక్ష్మణ స్వామి ప్రత్యేకంగా
అభినందించారు. అంతేకాకుండా సంఘ సభ్యులు ఎంతో కష్టపడి ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసినందుకుఒక్కొక్కరికి పేరుపేరునా శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలియజేసి వారందరికీ బాధ్యతలు అప్పజెప్పారు.
ఈ కార్యక్రమంలో ధన్వంతరి మహా హోమం నిర్వహించిన ప్రధాన కార్యదర్శి ఆధ్యాత్మిక విషయాలను ఆయుర్వేదం ఆధ్యాత్మికంగా ఎలా ఉంది ధన్వంతరి యొక్క ఆవిర్భావ విశేషాలను హోమం వల్ల వచ్చే అద్భుతలను ఆయుర్వేద జీవనం వైవిధ్యానికి అన్ని విషయాలను చాలా అద్భుతంగా వివరించారు.
ఈ కార్యక్రమంలో ధన్వంతరి ప్రార్థన ధన్వంతరి గీతాలను కూడా లక్ష్మణస్వామి రచించిన గీతాలను ఆవిష్కరించారు. ధన్వంతరి మూలమంత్రాలు వాటికి అర్థము ఆ గీతాలలో స్పష్టంగా వివరించారు
ఆయుర్వేద విజ్ఞానాన్ని ప్రచారం చేయడానికి ఒక అద్భుతమైన అస్థిరంగా లక్ష్మణ్ స్వామి రచిస్తున్న వ్యాసపరంపరలో పుస్తకాలు అంతేకాకుండా ఆయుర్వేద గీతాలు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటాయని అద్భుతమైన కవి రచయిత అయిన పరంపర వైద్యులు కూడా ఆయన సింహాచలం లక్ష్మణస్వామి ని ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.

## మహేష్ గౌడ్ చేతుల మీదుగా బీ-ఫామ్ తీసుకున్న జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్..



**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):అక్టోబర్ 19,**జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగ నవీన్ యాదవ్ అధికారికంగా కాంగ్రెస్ పార్టీ తరపున బి-ఫారం ను రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ చేతుల మీదుగా స్వీకరించారు.ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ ఆశయాలు విలువలు నాయకుల ఆశీస్సులు,ముఖ్యంగా జూబ్లీహిల్స్ ప్రజల విశ్వాసం నాకు ప్రేరణ అని అన్నారు.తాను వేసే ప్రతి అడుగు నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే ఉంటుందని ఈ సందర్భంగా అన్నారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ లో యువ నాయకుడు నవీన్ యాదవ్ విజయమే ప్రజల విజయంగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
దీపావళి పండుగ పర్వదినాన్ని ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని గట్టుప్పల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేరిపల్లి నగేష్ అన్నారు.దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.దీపావళి రోజు లక్ష్మి పూజ జరుపుకుంటూ ఆనందోత్సవాలతో మెలగాలని సూచించారు. ముఖ్యంగా బాణాసంచా విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్త వహిస్తూ టపాకాయలను కాల్చాలని అన్నారు.



# వలలో చిక్కుతున్నా..

# ప్రభుత్వ అధికారులకు వణుకేది..?

**ప్రజావినికిడి,(పరిగి):**
ప్రభుత్వ కార్యాలయాల్లో చేయి తడపనిదే పనులు జరగడం లేదు. సేవాభావంతో పనిచేయాల్సిన కొందరు అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటు పడి పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే లేనిపోని కొర్రీలు పెడుతూ పనుల్లో విపరీత జాప్యం చేస్తున్నారు.చివరకు కాళ్లావేళ్లా పడి ఎంతో కొంత ముట్టచెబుతామంటేనే దస్త్రాలకు కదలిక వస్తోంది. ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు విస్తృతం చేశారు. అయినా లంచావతారుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. పనులు సవ్యంగా జరగాలంటే పూట పూటకో రేటు చెప్పడంతో కొందరు విసిగివేసారి పోయి అనిశాను ఆశ్రయిస్తున్నారు.

**అటవీశాఖలో కలకలం**

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. గత కొంతకాలంగా వివిధ ప్రాంతాల నుంచి పరిగి మీదుగా కలప రవాణా జరుగుతోంది. వెరసి అటవీ ప్రాంతాలు సైతం గత వైభవాన్ని కోల్పోతున్నాయి. అధికారుల చేతివాటం ఇందుకు ప్రధాన కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం పరిగిలో ఇద్దరు సెక్షన్ అధికారులు అనిశాకు చిక్కడంతో ఒక్కసారిగా అటవీశాఖలో కలకలం రేపుతోంది.జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో చేయి తపడనిదే పనులు జరగడం




లేదని బాహాటంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా పోలీసు, ఇంజినీరింగ్, రెవెన్యూ,పోలీసు, సబజిస్ట్రార్ తదితర శాఖల్లోనూ పనుల కోసం చేతులు తడపాల్సి వస్తోంది. మట్టి రవాణా, ఇసుక కేసుల్లో పోలీసుల తీరుపట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇవిగో ఉదాహరణలు**

పరిగి రేంజి పరిధిలో సీతాఫలాలను రవాణా చేసేందుకు న్యాయంగా పర్మిట్లు ఇవ్వాల్సిన అటవీ సెక్షన్ అధికారులు మైనొద్దీన్, సాయికుమార్లు రూ.40వేలు డిమాండ్ చేయడంతో చివరకు శుక్రవారం అనిశా వలకు చిక్కడం తాజా ఉదాహరణ..
ఇదే ఏడాది ఫిబ్రవరి 11న రూ.30వేలు లంచం తీసుకుంటూ ధారూర్ ఎస్సైగా పనిచేసిన వ్యక్తి డ్రైవర్తో పాటు పట్టుబడ్డారు.
పట్టాదారు పాసుపుస్తకం జారీకిసంబంధించి రెండు నెలల క్రితం కలెక్టరేట్లో జూనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి రైతును రూ.20వేలు డిమాండ్ చేసి చివరకు అనిశాకు చిక్కింది.
కొత్తగా ఎరువుల దుకాణం ఏర్పాటుకు అనుమతి పత్రం ఇచ్చేందుకు గతనెల 24న మోమిన్ పేట మండల వ్యవసాయాధికారి రూ.లక్ష డిమాండ్ చేసి రూ.50వేలు నగదు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు.

గతేడాది డిసెంబరు 23న తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

**నిర్భయంగా ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల పేరిట వేధింపులకు గురిచేసే అధికారులపై టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలి.బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తాం.
నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు.1064 అని అన్నారు.

## మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోండి: తెలంగాణ నేతలకు బండి సంజయ్ తీవ్ర హెచ్చరిక

తెలంగాణలోని కొందరు రాజకీయ నాయకులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. మావోయిస్టులతో ఉన్న సంబంధాలను వెంటనే తెంచుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఓ పోస్ట్ చేశారు."తెలంగాణ రాజకీయ నాయకులు దీనిని ఒక హెచ్చరికగా పరిగణించండి. వేదికలపై ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ, తెరవెనుక సాయుధ గ్రూపులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వెంటనే తమ సంబంధాలను వదులుకోవాలి. లేదంటే వారిని బట్టబయలు చేస్తాం. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యలు కేవలం మావోయిస్టు కేడర్‌తోనే ఆగిపోవు" అని బండి సంజయ్ తన పోస్ట్‌లో గట్టిగా హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో అవినీతి, నేరాలు, తీవ్రవాద సంబంధాలను కాపాడుతున్న శక్తులను కేంద్రం కనికరం లేకుండా అణిచివేస్తుందని ఆయన తెలిపారు. "సమస్యలో భాగమైన వారు ఎంత పెద్దవారైనా సరే.. పక్కకు తప్పుకోండి. దేశ అంతర్గత భద్రత విషయంలో తప్పు వైపు నిలబడితే ఎంతటి ఉన్నత నాయకులైనా పతనం కాక తప్పదు" అని స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బృందావన్ మీడోస్ కాలనీ అభివృద్ధి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం..

## -కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి..





**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ మీడోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పరచుకున్న సందర్భంగా ఆదివారం రోజు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ని వారి కార్యాలయంలో కలిసి కాలనీలో అభివృద్ధి సమస్యలు పరిష్కరించాలని కోరడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, ఒకటొకటిగా కాలనీలో ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని కాలనీవాసులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శశికాంత్, ఉపాధ్యక్షులు జగన్మోహన్ చారి, ప్రధాన కార్యదర్శి వేణు,ట్రెజరర్ రవితేజ, జాయింట్ సెక్రెటరీ రాజు,కార్యవర్గ సభ్యులు అరుణ్, రఘుమా రెడ్డి, సహదేవ్ త్రిపాటి, మరియు సౌభాగ్యనగర్ కాలనీవాసులు నందకిషోర్ తదితరులు ఉన్నారు.

# ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి దశదినకర్మ

**ఎర్రోళ్ల విజ్జయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి హరీష్ రావు..**

**ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య ఇటీవల మృతిచెందిన కారణంగా వారి నివాసమైన చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన దశదినకర్మ కార్యక్రమానికి హాజరై విజ్జయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అదేవిధంగా ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర,ఈ సందర్భంగా ఎర్రోళ్ల శ్రీనివాస్ కు వారి తండ్రి అకాల మరణం పట్ల సంతాపం తెలియజేసి మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ యువనాయకులు దినేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# భాగ్య లక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**హైద్రాబాద్ లోని చార్మినార్ వద్ద ఉన్న ఒక ప్రసిద్ధ ఆలయం భాగ్య లక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అలాగే రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త కు శాలువాతో సత్కరించడం జరిగింది.ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ,చారిత్రిక ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయం కారణంగానే హైదరాబాదు నగరాన్ని పూర్వం భాగ్యనగరం అని పిలిచేవారని చెబుతారు అని ఆయన అన్నారు.ఆ భాగ్య లక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న ఈ ఆవర్తనం మంగళవారం నాటికి అల్పపీడనంగా మారనుందని తెలిపింది. రాబోయే 48 గంటల్లో ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి వాయుగుండంగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో 22వ తేదీ నుంచి పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# రాబోయే రోజుల్లో జాతీయ క్రీడలకు వేదికగా పటాన్చెరు..

**క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలి..**

**క్రీడల అభివృద్ధికి ఆధునిక మైదానాలు, అత్యాధునిక వసతులు..**

**ఇక ప్రతి ఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయ క్రీడలకు ఆతిథ్యం అందిస్తాం..**

**పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..**



**ప్రజావినికిడి,(పటాన్చెరు):**
ఘనంగా ముగిసిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడలు..
అండర్ 14 కబడ్డీ బాలికల విభాగంలో..
మహబూబ్ నగర్ జిల్లాకు ప్రథమ స్థానం..
ఖమ్మం జిల్లాకు రెండవ స్థానం..
నల్గొండ జిల్లాకు మూడవ స్థానం..
వరంగల్ జిల్లాకు నాలుగవ స్థానం
అండర్ 14 కబడ్డీ బాలుర విభాగంలో
ప్రథమ స్థానం మెదక్ జిల్లా
ద్వితీయ స్థానం నల్గొండ జిల్లా
మూడవ స్థానం రంగారెడ్డి జిల్లా
4వ స్థానం మహబూబ్ నగర్ జిల్లా..
అండర్ 17 వాలీబాల్ బాలుర విభాగంలో
ప్రథమ స్థానం ఖమ్మం జిల్లా..
ద్వితీయ స్థానం వరంగల్ జిల్లా
తృతీయ స్థానం రంగారెడ్డి జిల్లా
నాల్గవ స్థానం మహబూబ్ నగర్ జిల్లా

క్రీడలకు, క్రీడాకారులకు కేంద్రంగా పటాన్చెరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర,జాతీయస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇవ్వబోతున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.

గత మూడు రోజులుగా పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 బాలుర,బాలికల కబడ్డీ అలాగే అండర్ 17 బాలుర వాలీబాల్ విభాగం రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ముగిసాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి క్రీడాకారు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు కృష్ణంరాజుతోపాటు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులను ఎమ్మెల్యే జిఎంఆర్ ఘనంగా సన్మానించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ,సమిష్టి కృషితో రాష్ట్రస్థాయి క్రీడలను విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు.జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాసాని వీరేష్ మాట్లాడుతూ,క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే లభించడం పటాన్చెరు నియోజకవర్గ ప్రజల అదృష్టం అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడలకు సంపూర్ణ మద్దతు అందిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్ ను అభినందించారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి కబడ్డీ జట్టులో తెలంగాణ క్రీడాకారుల ప్రాతినిధ్యం పెరగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.ఇందుకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

కబడ్డీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్ మాట్లాడుతూ,ఉమ్మడి మెదక్ జిల్లాలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభినందనీయుడు అన్నారు.కబడ్డీ క్రీడలో జాతీయస్థాయిలో మెదక్ జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం ప్రశంసనీయమన్నారు. రాబోయే రోజుల్లో పటాన్చెరు నియోజకవర్గం నుండి కబడ్డీ క్రీడాకారులు సైతం జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక కావాలని అభిలాషించారు.

శనివారం సాయంత్రం వేలాదిమంది అభిమానుల మధ్య జరిగిన అండర్ 14 బాలుర కబడ్డీ ఫైనల్ మ్యాచ్ లో నల్లగొండ జిల్లా జట్టుపై మెదక్ జట్టు ఘన విజయం సాధించింది..అండర్ 14 బాలికల కబడ్డీ ఫైనల్ మ్యాచ్ లో మహబూబ్ నగర్ జిల్లా జట్టు పైన ఖమ్మం జిల్లా జట్టు పైన ఘన విజయం సాధించింది. అండర్ 17 బాలుర వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ లో వరంగల్ జిల్లా జట్టు పైన ఖమ్మం జిల్లా జట్టు ఘన విజయం సాధించింది.

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్చెరు..

**ఉత్తర భారతీయులు తెలంగాణ వాసులే**

**అతి త్వరలో సూర్య దేవాలయం,ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**ప్రతి ఒక్కరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం..**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ సముచిత ప్రాధాన్యత..**

**ప్రతి గెలుపులో మీ మద్దతు మరువలేనిది**

**ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్**



**ప్రజావినికిడి,(పటాన్చెరు):**
మినీ ఇండియా గా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని.. జీవనోపాధి కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి తరలి వచ్చి దశాబ్దాలుగా పటాన్చెరు నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రజలందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటూ వారి ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.

ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ శివారులో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా దీపావళి పర్వదినం పురస్కరించుకొని ప్రతి ఏటా ఉత్తర భారతీయులు ఘనంగా నిర్వహించుకునే చట్ పూజ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ,తాను రాజకీయాల్లోకి ప్రవేశించిన నాటి నుండి నేటి వరకు ఉత్తర భారతీయులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నామని తెలిపారు. మొదటిసారి ఎంపీటీసీగా ఎన్నికైన నాటి నుండి ఎంపీపీ, మూడుసార్లు పటాన్చెరు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో వీరి మద్దతు మరువలేనిదని అన్నారు. నియోజకవర్గంలోని వివిధ పరిశ్రమలలో కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్న ఉత్తర భారతీయులకు ఏదైనా ప్రమాదాలు సంభవించినప్పుడు యాజమాన్యాలతో చర్చించి మెరుగైన నష్టపరిహారాలు అందిస్తున్నామని తెలిపారు.ఇటీవల అగర్వాల్ రబ్బర్ పరిశ్రమతో పాటు సాయిబాబా సెల్లులోజ్ పరిశ్రమలో ప్రమాదాలకు గురైన కార్మికుల కుటుంబాలకు మెరుగైన నష్టపరిహారం అందించామని గుర్తు చేశారు.ఎప్పుడు ఎటువంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలని..24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

పటాన్చెరు నియోజకవర్గంలోనే స్థిర నివాసం ఏర్పరచుకునేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ సముచిత ప్రాధాన్యత అందిస్తున్నామని తెలిపారు.గతంలో హామీ ఇచ్చిన విధంగా అతి త్వరలో ఉత్తర భారతీయుల కోసం ఫంక్షన్ హాల్,సాకి చెరువు కట్ట పైన సూర్యదేవుడి ఆలయం నిర్మించబోతున్నామని తెలిపారు.చట్ పూజా సందర్భంగా ఉచితంగా చెరుకు పంపిణీకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాబోయే రోజుల్లోనూ మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం నాయకులు సందీప్ షా కు సమావేశం ఘన నివాళులు అర్పించింది.. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఘనంగా సన్మానించారు.

# అంతా ఆ అధికారుల చేతిలోనే..

**దీపావళి పటాకుల దుకాణానికి అనుమతి కావాలన్నా..**

**ఒక్క దుకాణ అనుమతికి డబ్బులు ఇవ్వాల్సిందేనంట..?**

**అనుమతి తీసుకున్న దుకాణాలు 12మాత్రమే.. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే దుకాణాలు మరెన్నో..**

**చిన్న ప్రమాదం జరిగిన భారీ స్థాయిలో నష్టం జరిగే ప్రమాదం..**

**ప్రమాద హెచ్చరికలు, పరిశీలన శూన్యం..**

**చర్యలు తీసుకోవాల్సిన అధికారులే చోద్యం చూస్తున్నారు..**

**వివరాలకు సంప్రదించగా ఒకరిపై ఒకరు మాట దాటేస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు..**




**ప్రజావినికిడి,(షాద్ నగర్):** దీపావళి పర్వదినం వచ్చిందంటే చాలు అంతా ఆ అధికారి చేతిలోనే ఉంటుంది.దీపావళి పటాకుల వ్యాపారానికి సంబంధించి చిన్న వ్యాపారాల నుంచి తప్పకుండా ఫైర్ స్టేషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.కానీ షాద్ నగర్ పట్టణంలో ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. అంతా అధికారి చేతిలో ఉండడంతో అనుమతి తీసుకుని ఏర్పాటు చేసే పటాకుల దుకాణాలు కొన్ని అయితే అనుమతి లేకుండా ఏర్పాటు చేసే దుకాణాలు మరెన్నో ఉన్నాయి.ఒక్కో దుకాణా ఏర్పాటుకు డబ్బులు ఇవ్వాల్సిందేనంట.. ఇప్పటివరకు షాద్ నగర్12 దుకాణాలకు మాత్రమే అనుమతి ఇచ్చారంట.మరోవైపు ఒక్క దుకాణానికి అనుమతి తీసుకొన్న వారే మరికొన్ని దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. చిన్న ప్రమాదం జరిగిన భారీ స్థాయిలో నష్టం జరిగే ప్రమాదం తప్పదు. ప్రమాద హెచ్చరికలు,పరిశీలన శూన్యమని,చర్యలు తీసుకోవాల్సిన అధికారులే చోద్యం చూస్తున్నారు. షాద్నగర్ పట్టణంలో ఏర్పాటు చేస్తే పటాకుల దుకాణాలకు సంబంధించిన వివరాలకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ను సంప్రదించగా ఏ డి ఎఫ్ ఓ వద్ద వివరాలు ఉంటాయని ఈ విషయమే ఆయనను సంప్రదించగా ఆయన షాద్ నగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వద్ద ఉంటాయని ఒకరిపై ఒకరు మాట దాటేస్తున్నారు.పట్టణంలో ఎక్కడపడితే అక్కడ పటాకుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించగా మాకు ఎలాంటి సంబంధం లేదు స్థానిక పోలీసులు చూసుకుంటారని చెప్తున్నారు.ప్రతి సంవత్సరం దీపావళి పర్వదినం వచ్చిందంటే చాలు ఈ అధికారుల హడావిడి మాత్రమే కనబడుతుంది తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆ అధికారిలపై ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.

# చెక్‌పోస్టులపై ఏసీబీ దాడులు భారీగా నగదు స్వాధీనం

**హైదరాబాద్, అక్టోబర్ 19:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరం భీం జిల్లాల్లోని చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు దాడులు చేసి.. సోదాలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలోని చిరాగ్‌పల్లి మండలం మాడ్గిలోని అంతరాష్ట్ర ఆర్టీఏ చెక్ పోస్టుపై గత అర్ధరాత్రి ఏసీబీ అధికారుల దాడి చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్‌లో ఏసీబీ సోదాలు నిర్వహించింది.అదే విధంగా కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సలాబత్‌పూర్ ఆర్టీవో చెక్ పోస్ట్‌లో సైతం ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. ఆ క్రమంలో బోరజ్ చెక్ పోస్టులో రూ.1, 26000 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక కొమురం బీమ్ జిల్లా వాంకిడి చెక్ పోస్ట్‌లో రూ.5,100 స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్ జిల్లా బైంసా చెక్ పోస్టులో రూ. 3 వేల అక్రమ నగదు



స్వాధీనం చేసుకున్నారు.కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం పోందుర్తి ఆర్టీఏ చెక్ పాయింట్ వద్ద ఏసీబీ అదికారుల దాడులు చేశారు. చెక్ పోస్టుల వద్ద ప్రైవేటు వ్యక్తుల నుండి రూ. 51,300 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీపావళి వేళ.. తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు వాహనదారులు రాక పోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో అవినీతికి ఆస్కారం ఏర్పడే అవకాశం ఉందనే ఫిర్యాదులు వెల్లవెత్తాయి. దాంతో తెలంగాణ సరిహద్దు జిల్లాల్లోని ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఆ క్రమంలో ఈ దాడులు చేపట్టారు.

# బంద్ వేళ దాడులు ఎనిమిది మంది అరెస్ట్

**హైదరాబాద్, అక్టోబర్ 19:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్య వేదిక(బీసీ జేఏసీ) శనివారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్ దాదాపుగా ప్రశాంతంగా జరిగినా.. కొన్ని ప్రాంతాల్లో మాత్రం హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. అందుకు కారణమైన ఎనిమిది మందిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ దాడులకు పాల్పడిన వారిపై నల్లకుంట, కాచిగూడ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.బీసీ బంద్ నేపథ్యంలో విద్యానగర్ నుంచి బర్కత్‌పూర వరకు బీసీ



జేఏసీ నేతలు ర్యాలీగా తరలి వచ్చారు. ఆ క్రమంలో ఈ మార్గంలో తెరిచి ఉంచిన పలు షాపులు, షోరూంలతోపాటు పెట్రోల్ బంక్‌పై దాడులు చేశారు. దీంతో బాధితలు పోలీసులను ఆశ్రయించారు. వీరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీ లించి.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శనివారం అర్థరాత్రి ఈ హింసాత్మక సంఘటనలకు బాధ్యులను పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు.

# ప్రాజెక్ట్‌లను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్

**ఖమ్మం, ఆగస్ట్ 10:** గత ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టు మధ్యలో పనులను అర్ధాంతరంగా ముగించేసిందని విమర్శించారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడులో రూ. 630 కోట్లతో నిర్మించ తలపెట్టిన జవహర్ ఎత్తిపోతల పథకానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ అంటేనే పేదల ప్రభుత్వమని ఆయన అభివర్ణించారు.10 ఏళ్లలో కేసీఆర్ ఒక్క ఇల్లు అయినా నిర్మించాడా? అని ప్రజలను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. అలాగే గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సన్న బియ్యం పంపిణి చేశాడా? అంటూ ప్రజలను అడిగారు. రూ. 12 వేల కోట్లతో ఆర్ అండ్ బి రోడ్లు నిర్మాణం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన ప్రజా సంక్షేమంపై మాత్రమే ఉంటుందని.. అంతే కానీ ఓట్లపై ఉండదంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క..



అపర భగీరథుడని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ చివరి ఆయకట్టు రైతులకు తొలిసారి నీరు ఇచ్చేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కంకణం కట్టుకున్నారని తెలిపారు. దశబ్ద కాలంగా జవహర్ ఎత్తిపోతల పథకాన్ని నిర్వీరం చేసిన ఘనత గత ప్రభుత్వానికే దక్కుతోందని మండిపడ్డారు. నాగార్జునసాగర్ నీరు పాలేరు రిజర్వాయర్ ద్వారా వైరాకు అక్కడి నుంచి మధిర, ఎర్రిపాలెం మండలాలకు సాగునీరు.. తాగునీరు అందించేందుకు డిప్యూటీ సీఎం భట్టి ప్రణాళికలు రచించారని వివరించారు. అందుకు రూ.630. 30 కోట్లతో ఈ రోజు శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని రేవంత్ సర్కార్ పరుగులు పెట్టిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. మాట ఇచ్చాం ఇల్లు పూర్తి చేస్తున్నాం.. అర్హులైన పేద ప్రజలు ఎవరూ కూడా ఇందిరమ్మ ఇళ్లు రాదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు. తమ ప్రభుత్వంలో రైతులకు టింగు టింగు మంటూ వారి ఖాతాలో రైతు భరోసా పథకం కింద నగదు పంపిణీ జరిగిందన్నారు. భూ భారతితో రైతులకు అనుకూలమైన చట్టం చేశామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి పేదవానికి సేవ చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భరోసా ఇచ్చారు.

# విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్ దాఖలు సునీత నామినేషన్ ఆమోదం పొందితే ఉపసంహారణ

**హైదరాబాద్ అక్టోబర్ 19:** హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు బీఆర్ఎస్ తరఫున ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్ దాఖలు దాఖలు చేశారు. ఎన్నికల అధికారులకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను పీవీఆర్ అందజేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విష్ణుతో నామినేషన్ వేయించామని బీఆర్ఎస్ చెబుతోంది. మాగంటి సునీత నామినేషన్‌ను




ఎన్నికల అధికారులు ఆమోదం తెలిపిన తరువాత విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్ ఉపసంహరించుకుంటారని సమాచారం. బైపోల్ లో బరిలో నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత ఇప్పటికే (అక్టోబర్ 15) నామినేషన్ దాఖలు చేశారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు.హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక పొలిటికల్ హీట్ పెంచుతుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఈ స్థానానికి ఉపఎన్నిక ఖరారైంది.ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు, బైపోల్ నిర్వహణకు చర్యలు వేగవంతం చేస్తున్నారు. అటు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించాయి. బీఆర్ఎస్ తరఫున గోపీనాథ్ భార్య మాగంటి సునీతను గులాబీ పార్టీ బరిలోకి దింపింది. కాంగ్రెస్ పార్టీ తరఫున నవీన్ యాదవ్ పోటీ చేయనున్నారు. ఇక బీజేపీ పార్టీ తరఫున లంకల దీపక్ రెడ్డి పోటీ చేయనున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ఉపఎన్నికకు నామినేషన్ దాఖలు చేశారు. అటు జూబ్లీహిల్స్ లోని డివిజన్లలో అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. గెలుపు ఎవరిని వరిస్తుందనేదానిపై రోజురోజుకి ఉత్కంఠ పెరుగుతుంది.

# తెలంగాణలో యూరియా కొరత ఎందుకొచ్చింది రేవంత్ ప్రభుత్వంపై టీ బీజేపీ చీఫ్ ప్రశ్నల వర్షం

**ఖమ్మం:** జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని.. అభివృద్ధి మాత్రం లేదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే నిధులతో ఖమ్మం జిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి జరుగుతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఏ ఎన్నికలైనా బీజేపీ అభ్యర్థులదే విజయమని జోస్యం చెప్పారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల గడ్డ కాదని.. ఇకపై బీజేపీ అడ్డా కాబోతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో చాలామంది కమ్యూనిస్టులు తనకు టచ్‌లో ఉన్నారని తెలిపారు. కమ్యూనిస్టులు బీజేపీలోకి రావాలని స్వాగతం పలికారు. (మంగళవారం) ఖమ్మం జిల్లాలో రామచ ంద్రరావు పర్యటించారు. ఖమ్మం నగరంలో రామచంద్రరావు రోడ్ షో నిర్వహించారు. నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రరావు ఏబీఎన్‌తో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేంద్రప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ




ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్ 2004-2005లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని. కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. రాజకీయాల కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తాను చెప్పింది తప్పయితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని.. మీది తప్పు అయితే మీరు రాజీనామా చేస్తారా అని తుమ్మలకు సవాల్ చేశారు. తుమ్మల తనకు మిత్రులే అది తర్వాత సంగతి అని చెప్పుకొచ్చారు రామచంద్రరావు.బీసీ రిజర్వేషన్ విషయంలో తాము చిత్తశుద్ధితో ఉన్నామని రామచంద్రరావు నొక్కిచెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆక్షేపించారు. బీసీలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏ పార్టీలో అయినా ఆ పార్టీ నాయకుడు లేదా ముఖ్యమంత్రి స్థాయి నేతలు ఆయా రాష్ట్రాల్లో పాదయాత్రలు చేస్తారని.. కానీ కాంగ్రెస్‌లో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ జయంతి నటరాజన్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందో అర్థమవుతోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరిని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ది బీసీ రిజర్వేషన్ కాదని.. ముస్లింల రిజర్వేషన్ అని ఆరోపించారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. తాము ముస్లింల రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని క్లారిటీ ఇచ్చారు. ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏం చేస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరా రు. ఖమ్మం, నల్గొండ బ్యాచ్ ముఖ్యమంత్రిని సరిగా పని చేయనీయటం లేదని రామచంద్రరావు విమర్శలు చేశారు.

# సాంస్కృతి,సాంప్రదాయాలు భావితరాలకు అందించాలి

**నార్నూర్ :** ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జామడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన దండారి ఉత్సవాల్లో ఎస్పీ పాల్గొన్నారు. గుస్సాడి, వాయిద్యాలతో ఎస్పీకి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏత్మాసూర్ పేన్ కు సాంప్రదాయ పూజలు చేసిన అనంతరం ఆదివాసి పెద్దలు శాలువాతో



సన్మానించారు.ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మూఢనమ్మకాల ను విశ్వసించకుండా వ్యాధుల బారిన పడితే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. బాబాలు, మంత్రగాళ్లను నమ్మవద్దన్నారు. పిల్లలకు చదువు పట్ల గల ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు.అంతకుముందు ఆ గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, నార్నూర్ సీఐ డి. పద్మ, ఎస్సైలు సాయన్న, అఖిల్, రాయి సెంటర్ జిల్లా సార్ మేడి మేస్రం దుర్గుపటేల్, తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో రాథోడ్ గంగా సింగ్, నాయకులు రామకృష్ణ, కోశేరావ్. వెంకటరావ్ పటేల్ పాల్గొన్నారు.

# 8 మంది బీసీ నేతల అరెస్ట్ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం

**హైదరాబాద్:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్య వేదిక శనివారం తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.. ఈ బంద్ కు అన్ని పార్టీలు, సంఘాలు మద్దతు తెలిపాయి. అయితే.. ఈ బంద్ అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగింది.. కానీ కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు చర్యలు ప్రారంభించారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 18 (శనివారం) నాడు జరిగిన దాడులపై పోలీసుల కేసు నమోదు చేసి.. ఎనిమిది మంది యువకులను అరెస్టు చేశారు. ఈ మేరకు కాచిగూడ పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. బజాజ్ ఎలక్ట్రానిక్స్ మేనేజర్ సయ్యద్ అమీనుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు యువకులను అరెస్టు చేశారు. బీసీ నాయకులు బుజ్జ కృష్ణ, నిఖిల్, రామకోటి, రాజ్ కుమార్, మోడీ, సాయిబాబా, రవితేజ, రామ్మూర్తిలపై




వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎనిమిది మంది యువకులకు గాంధీ హాస్పిటల్‌లో వైద్య పరీక్షల అనంతరం జడ్జి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిం చారు. కాగా.. దాడులకు పాల్పడిన వారిపై నల్లకుంట, కాచిగూడ పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి.ఆర్ .కృష్ణయ్య ఆగ్రహం.కాగా.. యువకుల అరెస్ట్‌పై బీసీ సంఘాల ఆగ్రహం వ్యక్తంచేశాయి. దొంగలు, నక్సలైట్లను అరెస్ట్ చేసిన విధంగా అర్ధరాత్రి అరెస్ట్ చేస్తారా..? అని బీసీ సంఘం నేత, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు రాకుండా కాంగ్రెస్ యత్నిస్తోందంటూ ఆయన మండిపడ్డారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్ట్ చేయడం సరికాదంటూ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.


# చేసిన అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది




**మూసాపేట, అక్టోబర్19 :** బీఆర్ఎస్ హయంలో చేసిన అభివృద్ధితో జూబ్లిహిల్స్‌లో తమ అభ్యర్థి విజయం ఖాయమని నర్సాపూర్ శాసన సభ్యురాలు సునిత లక్ష్మారెడ్డి అన్నారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్ పరిధి ప్రేమ్‌నగర్, ఓల్డ్ శాస్త్రీనగర్‌లలో సునితా లక్ష్మారెడ్డి ఆదివారం మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, ఎర్రగడ్డ డివిజన్ కంటెస్టడ్ కార్పొరేటర్ పల్లవి మహేందర్ యాదవ్‌తో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ..కాంగ్రెస్ రెండెళ్ల పాలనలో ప్రజలు విసిగిపొయారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ద్వారానే ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ప్రజలను మోసం చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో రానున్న జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అర్థం అవుతుందన్నారు. ఏ బస్తీకి వెళ్లిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించే ఓటర్లు మాట్లాడుతున్నారని ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునితాగోపినాథ్ భారీ మోజార్టీతో విజయం సాధించడం ఖాయమని అమే అన్నారు. కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి. సంజీవ, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, షరీఫ్ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ తరపున విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో అనివార్యమైన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక రసవత్తరంగా మారింది. నవంబర్ 11న పోలింగ్ జరగనున్న ఈ ఎన్నికను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించి నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ దివంగత సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతకు మరోసారి అవకాశం కల్పించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్‌ను బరిలోకి దింపగా.. బీజేపీ తరపున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు.అయితే, బీఆర్ఎస్ పార్టీ ఈ ఉప ఎన్నిక విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ప్రధాన అభ్యర్థి మాగంటి సునీత ఇప్పటికే మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ.. ముందస్తు జాగ్రత్త చర్యగా పార్టీ మరో అభ్యర్థితో కూడా నామినేషన్ వేయించింది. దివంగత సీనియర్ నేత పి. జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) కుమారుడు, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణు వర్ధన్ రెడ్డితో కూడా బీఆర్ఎస్ తరపున ప్రత్యామ్నాయ నామినేషన్



దాఖలు చేయించింది. ప్రధాన అభ్యర్థి మాగంటి సునీత సమర్పించిన నామినేషన్ పత్రాలలో ఏవైనా సాంకేతిక గురైతే బీఆర్ఎస్ అభ్యర్థిగా విష్ణు వర్ధన్ రెడ్డి ఆ స్థానంలో పోటీలో నిలబడే అవకాశం ఉంటుంది.ఒకవేళ మాగంటి సునీత నామినేషన్ సక్రమంగా ఉండి ఎన్నికల సంఘం ఆమోదిస్తే, నామినేషన్‌ను ఉపసంహరించుకుంటారు. ఈ విధంగా ఎన్నికల బరిలో తమ పార్టీ అభ్యర్థి తప్పనిసరిగా ఉండాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఈ ముందు జాగ్రత్త చర్య తీసుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో గెలుపును ప్రతి పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ తరహా రాజకీయ వ్యూహాలు చర్చనీయాంశ మవుతున్నాయి. కాగా, నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అరుదైన ఘనత సాధించిన రోహిత్ శర్మ సచిన్, విరాట్ జాబితాలో మాజీ కెప్టెన్



పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. ఈ సిరీస్‌లో రోహిత్ కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే ఆడనున్నాడు. ఇటీవల టీమిండియా వన్డే జట్టు కెప్టెన్‌గానూ గిల్‌కు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. రోహిత్ చాలారోజుల తర్వాత మైదానంలో టీమిండియా జెర్సీలో కనిపించాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ వచ్చాడు. ఈ మ్యాచ్‌తో ప్రత్యేక జాబితాలో చేరాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌లో వన్డేల్లో అరంగేట్రం చేశాడు. ఆస్ట్రేలియా సైతం ఇద్దరికి కొత్తగా జట్టులో చోటు కల్పించింది. పెర్త్‌లో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో భారత జట్టు ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు, ముగ్గురు ఆల్ రౌండర్లకు చోటు కల్పించింది. భారత జట్టు వన్డేల్లో వరుసగా 16వ సారి టాస్ ఓడిపోయింది. ఈ ఫార్మాట్‌లో చివరిసారిగా భాంజరుగుతున్న తొలి మ్యాచ్‌లో భారత జట్టు త్ 2023 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై టాస్ గెలిచింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చారు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ భారత జట్టు తరపున వన్డేల్లో బరిలోకి దిగారు. రోహిత్, కోహ్లీ దాదాపు 224 రోజుల తర్వాత బ్లూడ్రెస్‌లో కనిపించారు. చాలా రోజుల తర్వాత మైదానంలోకి వచ్చిన రోహిత్ ఈ మ్యాచ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. కేవలం 16 నిమిషాల పాటు క్రీజులో ఉన్నారు. జోష్ హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో రోహిత్ స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. 14 బంతుల్లో ఎనిమిది పరుగులు చేసి ఒక ఫోర్ చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ మ్యాచ్‌లో ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు సంపాదించడం ద్వారా అరుదైన ఘనత సాధించాడు. రోహిత్‌కు ఇది 500వ అంతర్జాతీయ మ్యాచ్. ఈ జాబితాలో ఐదో ఆటగాడిగా నిలిచాడు. ఇంతకు ముందు ఈ జాబితాలో సచిన్, విరాట్, మహేంద్ర సింగ్ ధోని, రాహుల్ ద్రవిడ్ మాత్రమే 500 కంటే ఎక్కువ మ్యాచులు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ముందున్నారు.

# జీఎస్టీ తగ్గినా ఈ 24 వస్తువుల రేట్లు తగ్గలేదు అసలు కథ ఏంటంటే



జీఎస్టీ సంస్కరణలతో కేంద్రం సామాన్యులకు బిగ్ రిలీఫ్ ఇచ్చింది. దీపావళికి ముందే జీఎస్టీ తగ్గింపుతో చాలా వాటి ధరలు తగ్గాయి. జీఎస్టీ తగ్గించాక నిజంగానే వస్తువుల రేట్లు తగ్గాయా..? అనే విషయంపై కేంద్రం స్పెషల్ ఫోకస్ పెట్టింది. మొత్తం 54 గృహోపకరణాల ధరల్లో మార్పులను పర్యవేక్షించగా అందులో 30 వస్తువుల ధరలు ఊహించిన దాని కంటే ఎక్కువగా తగ్గాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ధరలు తగ్గింది వీటికేదేశవ్యాప్తంగా ఉన్న 21 సెంట్రల్ జీఎస్టీ జోన్ల నుండి అందిన సమాచారం ప్రకారం.. ఎయిర్ కండిషనర్లు, టెలివిజన్లు, టమాటో కెచప్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, జామ్, సిమెంట్ వంటి 30 వస్తువుల ధరలు అంచనాలకు మించి తగ్గాయి. ఆహార పదార్థాలలో, డ్రైఫ్రూట్స్, చీజ్, జామ్, టొమాటో కెచప్ వంటి వాటిపై జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించడంతో ధరలు గణనీయంగా తగ్గాయి. అలాగే షాంపూ, టూత్ బ్రష్‌లు, టాల్కమ్ పౌడర్, ఫేస్ పౌడర్ వంటి సౌం దర్య సాధనాలు, కళ్లద్దాలు, ఏసీ యంత్రాలు, టీవీ సెట్‌లు, కిచెన్‌వేర్ ధరలు కూడా బాగా తగ్గాయి. తగ్గాల్సిన వస్తువులపై ఫోకస్జీఎస్టీ రేటు తగ్గిం పు ప్రయోజనం ఇంకా వినియోగదారులకు పూర్తిస్థాయిలో అందలేదనే చెప్పాలి. ఎందుకంటే ఇంకా 24 వస్తువుల రేట్లు తగ్గలేదు. వీటిలో నోట్ బుక్‌లు, చాక్లెట్లు, హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, పెన్సిళ్లు, థర్మామీటర్లు, సైకిళ్లు వంటి నిత్యావసరాలు ఉన్నాయి. నెయ్యి, బిస్కెట్లు, ఐస్ క్రీం, కేక్‌ల ధరలు కూడా ఊహించిన దానికంటే తక్కువగా తగ్గాయి.కంపెనీలతో కలిసి.ధరలు తగ్గని వస్తువులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ విషయంలో కంపెనీలతో కలిసి పనిచేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా వినియోగదారులకు ప్రయోజనాలను అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

# ఒక్కటే పెద్ద లోన్ మంచిదా రెండు చిన్న లోన్లు తీసుకుంటే మంచిదా మీ డబ్బు సేవ్ అవ్వడానికి ఏది బెస్ట్



ఇంటి మరమ్మతులు, వైద్య బిల్లులు, పాఠశాల ఫీజులు లేదా అత్యవసర పరిస్థితులకు డబ్బు అవసరమైనప్పుడు చాలా మంది పర్సనల్ లోన్ తీసుకుంటూ ఉంటారు. అయితే మనకు కావాల్సిన మొత్తాన్ని ఒకే లోన్‌గా అంటే ఉదాహరణకు మనకు ఓ రూ.5 లక్షలు అవసరం అనుకుంటే.. రూ.5 లక్షలకు ఒకే లోన్ తీసుకుంటే మంచిదా? లేదా రెండు చిన్న లోన ్లగా రూ.2.5 లక్షలు, రూ.2.5 లక్షలు తీసుకుంటే మంచిదా అనేది ఇప్పుడు చూద్దాం.ఒకే లోన్ తీసుకుంటే నెలకు ఒక ఈఎంఐ మాత్రమే ఉంటుంది. సో ఈఎంఐని ట్రాక్ చేయడం సులభం అవుతుంది. తక్కువ ఒత్తిడితో కూడుకున్నదిగా అనిపిస్తుంది. అలాగే మీరు మొత్తం లోన్ మొత్తాన్ని ఒకేసారి పొందుతారు. రెండు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో పోలిస్తే ఒకే రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం ఈజీ అవుతుంది. తక్కువ ఫారమ్‌లు, ఆమోదాలు, డాక్యుమెంటేషన్‌లు ఉంటాయి. కానీ, పెద్ద రుణానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. పెద్ద రుణాలు అధిక నెలవారీ చెల్లింపులతో వస్తాయి, ఇది మీ బడ్జెట్‌ను దెబ్బతీస్తుంది. అదే వడ్డీ రేటుతో కూడా, కాలక్రమేణా పెద్ద మొత్తాన్ని చెల్లించడం వల్ల మీరు చెల్లించే మొత్తం వడ్డీ పెరుగుతుంది. ఒక్క కూడా చెల్లించకపోవడం వల్ల పెద్ద ప్రభావం ఉంటుంది, మీ ఆదాయంలో హెచ్చుతగ్గులు ఉంటే అది ప్రమాదకరంగా మారుతుంది.రెండు చిన్న రుణాలు.ఒక పెద్ద రుణానికి బదులుగా రెండు చిన్న రుణాలు తీసుకోవడం కొన్ని పరిస్థితులలో మెరుగ్గా ఉంటుంది. చిన్న రుణాలు సాధారణంగా తక్కువ నెలవారీ చెల్లింపులను కలిగి ఉంటాయి, ఇతర ఖర్చులతో పాటు వాటిని నిర్వహించడం సులభం చేస్తుంది. మీరు ప్రతి రుణాన్ని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ఉపయోగించవచ్చు, ఒకటి అత్యవసర ఇంటి మరమ్మతుల కోసం, మరొకటి విద్యా ఖర్చుల కోసం. ఇది మీరు తీసుకున్న లోన్ వేస్ట్ కాకుండా చేస్తోంది. కొంతమంది రుణదాతలు చిన్న రుణాలు లేదా స్వల్పకాలిక రుణాలపై తక్కువ రేట్లను అందిస్తారు, ఇది చెల్లించిన మొత్తం వడ్డీని తగ్గించవచ్చు. మీరు ఒక పెద్ద రుణంపైని చెల్లించలేకపోతే, మీరు ఒక రుణంపై చెల్లించలేని ఆర్థిక ప్రభావం కంటే తక్కువగా ఉంటుంది. పైగా రెండు చిన్న లోన్లలో ఏదైనా ఒక లోన్‌ను ప్రీ క్లోజ్ చేసుకోవచ్చు. ఒకటే పెద్ద లోన్ క్లోజ్ చేయాలంటే ఎక్కువ డబ్బు కావాలి.ఒకటి మాత్రం క్లోజ్ చేయడానికి సగం డబ్బు ఉంటే చాలు.

# తొలి వన్డేలో భారత్ ఓటమి



ఆస్ట్రేలియా పర్యటనను భారత్ ఓటమితో ఆరంభించింది. మూడు వన్డేల్లో భాగంగా పెర్త్‌లో జరిగిన తొలి వన్డేలో టీమిండియాపై ఆసీస్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. మ్యాచ్‌కు వాన పలుమార్లు ఆటంకం కలిగించడంతో ఆటను అంపైర్లు 26 ఓవర్లకు కుదించారు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆస్ట్రేలియాకు 131 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 21.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (46 నాటౌట్‌బీ 52 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), జోష్ ఫిలిప్ (37బీ 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగి ఆడారు. అర్ష్‌దీప్, అక్షర్, సుందర్ తలో ఒక వికెట్ తీసుకున్నారు. రెండో వన్డే గురువారం(అక్టోబర్ 23) జరగనుంది.టాస్ ఓడి..తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. 25 పరుగులకే కీలక వికెట్లోను భారత్ కోల్పోయింది. విరాట్ కోహ్లీ డకౌట్ కాగా.. రోహిత్ శర్మ 8 పరుగులు, శుభ్‌మన్ గిల్ 10 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరారు. కేఎల్ రాహుల్ (38) టాప్ స్కోరర్ కాగా అక్షర్ పటేల్ (31), నితీశ్ రెడ్డి(19) ఫర్వాలేదనిపించారు. శ్రేయస్ అయ్యర్ (11), వాషింగ్టన్ సుందర్ (10), పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో హేజిల్‌వుడ్, మిచెల్ ఓవెన్, కునెమన్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. మిచెల్ స్టార్క్, నాథన్ ఎలిస్‌కు చెరో వికెట్ దక్కింది. మొత్తంగా తొలి వన్డేను భారత్( పేలవంగా ప్రారంభించడంతో క్రికెట్ ఫ్యాన్స్ తీవ్రంగా నిరుత్సాహం చెందారు.

# దీపావళి స్పెషల్ కొత్త స్కీమ్స్ ప్రకటించిన ఎల్ఐసి



దీపావళి పండుగ సందర్భంగా దేశంలోని ప్రముఖ ప్రభుత్వ బీమా సంస్థ బీమా చేసుకున్న వారికి ఒక పెద్ద బహుమతిని అందించింది. తన కొత్త నెక్స్ట్ జనరేషన్‌పాలనలో రెండు పథకాలను ప్రారంభించింది. (ప్లాన్ 880),ప్లాన్ 881) ప్రకటించింది. ఇందులో బీమా చేసుకున్న వారికి ఆటో కవర్ సౌకర్యంతో పాటు హామీ ఇవ్వబడిన అదనపు సౌకర్యాలు లభిస్తాయి. అండ్ దొరిస్వామి ఈ పథకాలను అక్టోబర్ 16న ప్రారంభించారు. రెండు ప్లాన్‌లు ఆటో కవర్ సౌకర్యం, మూడు సంవత్సరాల ప్రీమియం చెల్లింపు తర్వాత హామీ ఇవ్వబడిన జోడింపులతో వస్తాయి, ఇది పెట్టుబడిదారులకు, పాలసీదారులకు ఆర్థిక భద్రతను ఇసాయి.జన్ సురక్ష (ప్లాన్ 880)ఇది తక్కువ ఆదాయ వర్గాల వారికి సూక్ష్మ బీమా పథకం. ఇది సరసమైన, సులభమైన బీమా కలను నెరవేరుస్తుంది. ఇది నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్ వ్యక్తిగత పొదుపు పథకం, ఇది వైద్య పరీక్ష లేకుండానే సాధారణ ఆరోగ్యవంతులైన వ్యక్తులకు అందుబాటులో ఉంటుంది. ప్రతి సంవత్సరం పాలసీ వ్యవధి ముగింపులో వార్షిక ప్రీమియంలో 4 శాతం హామీ ఇవ్వబడిన జోడింపులు అందుబాటులో ఉంటాయి. పాలసీదారుడు అకస్మాత్తుగా మరణిస్తే, కుటుంబానికి ఆర్థిక సహాయం, మెచ్యూరిటీ సమయంలో జీవించి ఉన్న పాలసీదారునికి పాలసీ డబ్బు మొత్తం లభిస్తుంది.ప్రవేశ వయస్సు: 18 నుండి 55 సంవత్సరాలుప్రాథమిక హామీ మొత్తం: కనీసం రూ.1 లక్ష, గరిష్టంగా రూ.2 లక్షలుపాలసీ వ్యవధి: 12 నుండి 20 సంవత్సరాలుపాలసీ వ్యవధి: 5 సంవత్సరాలుఎల్ఐసీ బీమా లక్ష్మి (ప్లాన్ 881)ఈ పథకం ప్రత్యేకంగా మహిళల కోసం రూపొందించబడింది, ఇది ప్రతి 2 లేదా 4 సంవత్సరాల తర్వాత (లేదా ప్రీమియం చెల్లింపులు నిలిపివేయబడినప్పుడు) జీవిత కవర్‌తో పాటు స్థిర డబ్బును తిరిగి అందిస్తుంది. ఇది కూడా నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్ ప్లాన్. ప్రతి సంవత్సరం మొత్తం పట్టిక వార్షిక ప్రీమియంలో 7 శాతం పాలసీ కింద హామీ ఇవ్వబడిన జోడింపులు అందుబాటులో ఉంటాయి. మహిళా క్రిటికల్ ఇల్నెస్ రైడర్ అదనపు ప్రీమియంతో అందుబాటులో ఉంది, ఇది మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.ప్రవేశ వయస్సు: 18 నుండి 50 సంవత్సరాలు పాలసీ వ్యవధి: 25 సంవత్సరాలుప్రీమియం చెల్లింపు వ్యవధి 7 నుండి 15 సంవత్సరాలుప్రాథమిక హామీ మొత్తం: కనీసం రూ.2 లక్షలు, గరిష్ట పరిమితి లేదు.బోనస్: రూ.10,000ఈ ప్లాన్‌లో మూడు సంవత్సరాల పూర్తి ప్రీమియం చెల్లింపుపై ఆటో కవర్ సౌకర్యం అందుబాటులో ఉంది.

# పాక్ దాడి అఫ్ఘాన్ క్రికెటర్లు మృతి

**- ట్రై సిరీస్ నుంచి తప్పుకొన్న అఫ్గాన్**

**- వైమానిక దాడులకు నిరసనగా నిర్ణయం**




**కాబూల్:** సరిహద్దు దేశాలతో నిత్యం ఘర్షణలకు దిగుతూ అంతర్జాతీయ సమాజం ఎదుట అభాసుపాలవుతున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. అఫ్ఘానిస్థాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌పై వైమానిక దాడులకు తెగబడి 8 మంది ప్రాణాలు తీసిన కయ్యాలమారికి కాబూలీలు దీటైన బదులిచ్చారు. త్వరలో పాకిస్థాన్ వేదికగా జరగాల్సి ఉన్న ముక్కోణపు టీ20 సిరీస్ (పాక్, అఫ్గాన్, శ్రీలంక) నుంచి వైదొలుగుతున్నట్టు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) శనివారం తెలిపింది. పాక్ నిర్వహించిన వైమానిక దాడుల్లో మరణించినవారిలో తమ దేశానికి చెందిన ముగ్గురు దేశవాళీ క్రికెటర్లూ ఉన్నారని.. వారి అమరత్వానికి గౌరవసూచకంగా సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది.ఫ్రెండ్లీ మ్యాచ్‌కు వెళ్లి.శుక్రవారం పాకిస్థాన్.. పాక్టికా ప్రావిన్స్‌లోని ఉర్గున్ జిల్లాపై వైమానిక దాడులకు దిగింది. అయితే ఈ దాడిలో స్థానిక క్రికెటర్లు కబీర్, సిబాతుల్లా, హరూన్ మృతి చెందారు. ఓ స్నేహపూర్వక మ్యాచ్ ఆడేందుకు గాను షరాన్ వెళ్లివస్తుండగా పాక్ జరిపిన దాడిలో ఈ ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఏసీబీ స్పందిస్తూ.. 'ఉర్గున్ జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ఏసీబీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నది. పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన ఈ పిరికిపంద చర్యతో మేము ముగ్గురు క్రికెటర్లను కోల్పోయాం. బాధితులకు గౌరవ సూచకంగా నవంబర్ చివర్లో పాక్‌లో జరగాల్సి ఉన్న ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాం' అని తెలిపింది.హేయమైన చర్య : క్రికెటర్లుఈ ఘటనపై అఫ్గాన్ క్రికెటర్లూ స్పందిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. అమాయక పౌరుల ప్రాణాలు తీయడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు. ఆ జట్టు సారథి రషీద్ ఖాన్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. 'పాక్ జరిపిన దాడిలో దేశానికి ప్రాతినిథ్యం వహించాలని కలలు కన్న యువ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రజలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం క్రూరమైన చర్య. ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనను సూచిస్తున్నది. ఈ సందర్భంగా ఏసీబీ తీసుకున్న నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నా' అని ఎక్స్‌లో రాసుకొచ్చాడు. పాక్ ఆర్మీ చర్యను అఫ్గాన్ స్వాతంత్ర్యంపై దాడిగా అభివర్ణించిన ఆ జట్టు మాజీ సారథి గుల్బాదిన్ నయీబ్.. ఇవి తమ దేశ ప్రజల స్ఫూర్తిని దెబ్బతీయలేవని తెలిపాడు. మిగిలిన క్రికెటర్లు సైతం మృతులకు సంతాపాన్ని ప్రకటించారు.

# శాంతించిన బంగారం

ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.2,400 తగ్గి రూ.1,32,400కి తగ్గింది. అంతకుముందు ఇది రూ.1,34,800గా ఉన్నది. ధంతేరస్ కావడంతో ఆభరణాల దుఖాణాల్లో కొనుగోలుదారుల సందడి నెలకొన్నప్పటికీ ధరలు తగ్గడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు భారీగా తగ్గడం వల్లనే దేశీయంగా ధరలు దిగొచ్చాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర అంతే స్థాయిలో తగ్గి రూ.1,31,800గా నమోదైంది. గతేడాది ధంతేరస్ నుంచి ఈసారి ధంతేరస్ వరకు 24 క్యారెట్ బంగారం ధర రూ.51 వేలు లేదా 62.65 శాతం పెరిగింది. ఏడాది క్రితం రూ.81,400గా ఉన్న పదిగ్రాముల ధర ప్రస్తుతం రూ.1.31 లక్షల స్థాయికి ఎగబాకింది.వెండిది అదే బాటరికార్డు స్థాయిలో దూసుకుపోయిన వెండి కూడా భారీగా తగ్గింది. అధిక ధరల కారణంగా కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో వెండి ఏకంగా రూ.7 వేలు దిగొచ్చింది. శుక్రవారం రూ.1.77 లక్షలుగా ఉన్న కిలో వెండి ప్రస్తుతం రూ.1.70 లక్షలకు దిగొచ్చింది. మరోవైపు, గడిచిన ఏడాదికాలంలో కిలో వెండి రూ.70,300 లేదా 70.51 శాతం ఎగబాకింది. కిందటి ఏడాది ధంతేరస్ రోజున రూ.99,700గా ఉన్నది.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# నెక్స్ట్ అల్లు అర్జున్ ఇతనే



దీపావళి పండగను పురస్కరించుకుని టాలీవుడ్ ప్రముఖులందరికీ గ్రాండ్ గా పార్టీ ఇచ్చాడు ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్. శనివారం (అక్టోబర్ 19) తన ఇంట్లో నిర్వహించిన ఈ గ్రాండ్ పార్టీకి మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్, శ్రీకాంత్, సిద్దు జొన్నల గడ్డ, దర్శకుడు హరీశ్ శంకర్, నిర్మాతలు అశ్వనీదత్, నవీన్ యెర్నేని, రోషన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, తేజ సజ్జ, జేడీ చక్రవర్తి, తరుణ్, మౌళి ఇలా చాలా మంది స్టార్స్ హాజరయ్యారు. ఈ పార్టీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇదే పార్టీలో కొందరు సినీ ప్రముఖులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు బండ్ల గణేశ్. ముఖ్యంగా హనుమాన్, మిరాయ్ సక్సెస్ లతో ఫుల్ జోష్ లో ఉన్న హీరో తేజ సజ్జా పై ప్రశంసలు కురిపించాడు. ' ప్రస్తుతం భారతీయ చలనచిత్ర పరిశ్రమలో నెక్స్ట్ అల్లు అర్జున్ తేజ సజ్జానే' అంటూ కాంప్లిమెంట్ ఇచ్చాడు. దీంతో అక్కడున్న వారందరూ బండ్ల గణేశ్ మాటలకు చప్పట్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఇదే పార్టీలో డైరెక్టర్ హరీశ్ శంకర్ ను ఉద్దేశించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు బండ్లన్న. 'నా జీవితాన్ని మార్చేసిన డైరెక్టర్' అంటూ తన అభిమానాన్ని చాటుకున్నాడు. కాగా పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కించిన గబ్బర్ సింగ్ సినిమాకు బండ్ల గణేశ్ నిర్మాతగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. కాగా ఈ పార్టీకి ఒకే కారులో వచ్చారు చిరంజీవి, శ్రీకాంత్. ఈ సందర్భంగా కారు దిగగానే బండ్ల గణేశ్ చిరంజీవి పాదాలకు నమస్కరించాడు. అనంతరం తనే స్వయంగా చేతులు పట్టుకుని ఇంట్లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఓ ప్రత్యేకమైన కుర్చీలో చిరంజీవిని కూర్చొబెట్టాడు. కాగా కొంతకాలంగా సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు బండ్ల గణేశ్. త్వరలోనే అతను మళ్లీ సినిమాలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే టాలీవుడ్ ప్రముఖులందరికీ గ్రాండ్ గా దీపావళి పార్టీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# నవంబర్ 7న థియేటర్స్ లో విడుదల కానున్న ప్రేమిస్తున్నా..

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
వరలక్ష్మీ పప్పుల ప్రజెన్స్ లో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లు గా నటించారు. పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ప్రేమిస్తున్నా సినిమా నవంబర్ 7న థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీరు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ప్రేమిస్తున్నా చిత్రం నుండి సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నా ను మేకర్స్ విడుదల చేశారు. 56 సెకెన్స్ నిడివి ఉన్న కంటెంట్ యువతను విపరీతంగా ఆకట్టుకొంటోంది. సినిమా ఎలా ఉండబోతోందో ఈ వీడియోలో చెప్పే ప్రయత్నం చేశారు చిత్ర యూనిట్. ఇంటెన్స్ లవ్ స్టోరీగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. స్వచ్ఛమైన ప్రేమకథతో రాబోతున్న ఈ సినిమాలో సాత్విక్ వర్మ, ప్రీతి నేహా పోటీపడి నటించారు. దర్శకుడు భాను ప్రేమిస్తున్నా సినిమాను న్యూ ఏజెడ్ లవ్ స్టోరీగా ఆడియన్స్ కు చూపించబోతున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ లభించింది. యూట్యూబ్ లో మిలియన్ వ్యూస్ తో ప్రేక్షకాధారణ పొందింది.

ఈ సందర్భంగా దర్శకుడు భాను మాట్లాడుతూ,

"అన్ కండీషనల్ లవ్ తో తెరకెక్కిన సినిమా ప్రేమిస్తున్నా. ఇప్పటివరకు తెలుగులో అంత అన్ కండీషనల్ లవ్ తో ఏ సినిమా రాలేదు,



అద్భుతమైన పాటలు, పర్ఫార్మెన్స్ తో ఈ చిత్రం నవంబర్ 7న థియేటర్స్ లో విడుదల కానుంది. చాలా కాలం తరువాత వస్తోన్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఈ సినిమా, మేము విడుదల చేసిన సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నా కు అన్ని వర్గాల ఆడియన్స్ నుండి సూపర్బ్ రెస్పాన్స్ లభిస్తోందని" అన్నారు.

ఇదొక మ్యూజికల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భాస్కర్ శ్యామల ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ అందించారు, అనిల్ కుమార్ అచ్చు గట్ల ఈ సినిమాకు సంభాషణలు రాయడం జరిగింది. ఈ సినిమాకు నిర్వహణ మర్రి రవికుమార్, ఎడిటర్ శిరీష్ ప్రసాద్.

# ఆ స్టార్ హీరో సినిమా అంటే చాలా ఇష్టం




ప్రేమలు సినిమాతో తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది కేరళ బ్యూటీ మమితా బైజు. ఒక్క సినిమాతోనే తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్న ఈ బ్యూటీ. ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. కోలీవుడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన ఈ చిత్రాన్ని తమిళంతోపాటు తెలుగులోనూ రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి రెస్పాన్స్ అందుకుంటున్న సినిమాల్లో డ్యూడ్ ఒకటి. లవ్ టుడే, డ్రాగన్ చిత్రాలతో హిట్స్ అందుకున్న హీరో ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి రెస్పాన్స్ అందుకుంటున్న సినిమాల్లో డ్యూడ్ ఒకటి. లవ్ టుడే, డ్రాగన్ చిత్రాలతో హిట్స్ అందుకున్న హీరో ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇందులో ప్రదీప్ సరసన మమితా బైజు హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. అంతకు ముందు ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది మమితా. మలయాళంలో చాలా కాలంగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కథానాయికగా అనేక సినిమాల్లో నటించింది ఈ ముద్దుగుమ్మ. ఇందులో ప్రదీప్ సరసన మమితా బైజు హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. అంతకు ముందు ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది మమితా. మలయాళంలో చాలా కాలంగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కథానాయికగా అనేక సినిమాల్లో నటించింది ఈ ముద్దుగుమ్మ. కానీ ప్రేమలు సినిమాతో ఈ బ్యూటీ క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ప్రేమలు సినిమా తర్వాత ఆమెకు తెలుగులో సెపరేట్ ఫ్యాన్ బేస్ క్రియేట్ అయ్యింది. ఈ మూవీ తర్వాత ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ.. ఇటీవల తనకు ఇష్టమైన హీరో గురించి చెప్పుకొచ్చింది. కానీ ప్రేమలు సినిమాతో ఈ బ్యూటీ క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ప్రేమలు సినిమా తర్వాత ఆమెకు తెలుగులో సెపరేట్ ఫ్యాన్ బేస్ క్రియేట్ అయ్యింది. ఈ మూవీ తర్వాత ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ.. ఇటీవల తనకు ఇష్టమైన హీరో గురించి చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలుగు సినిమాలు చూసేవారా అని అడగ్గా మమితా బైజు మాట్లాడుతూ.. రామ్ చరణ్ మగధీర సినిమా అంటే చాలా ఇష్టమని.. మలయాళంలో ఈ మూవీ ధీర పేరుతో వచ్చిందని.. ఆ సినిమా చాలా బాగుంటుందని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలుగు సినిమాలు చూసేవారా అని అడగ్గా మమితా బైజు మాట్లాడుతూ.. రామ్ చరణ్ మగధీర సినిమా అంటే చాలా ఇష్టమని.. మలయాళంలో ఈ మూవీ ధీర పేరుతో వచ్చిందని.. ఆ సినిమా చాలా బాగుంటుందని చెప్పుకొచ్చింది. అలాగే తాను స్కూల్ టైంలో ఉన్నప్పుడు ఆర్య, ఆర్య 2 చిత్రాలు చూశానని.. ఆ రెండు సినిమాలు చాలా బాగుంటాయని చెప్పుకొచ్చింది. ఇక రీసెంట్ టైమ్స్ మూవీ గురించి చెప్పలేదు. దీంతో అల్లు అర్జున్, చరణ్ ఫ్యాన్స్ మమిత చేసిన కామెంట్స్ తెగ షేర్ చేస్తున్నారు. అలాగే తాను స్కూల్ టైంలో ఉన్నప్పుడు ఆర్య, ఆర్య 2 చిత్రాలు చూశానని.. ఆ రెండు సినిమాలు చాలా బాగుంటాయని చెప్పుకొచ్చింది. ఇక రీసెంట్ టైమ్స్ మూవీ గురించి చెప్పలేదు. దీంతో అల్లు అర్జున్, చరణ్ ఫ్యాన్స్ మమిత చేసిన కామెంట్స్ తెగ షేర్ చేస్తున్నారు.



# విడాకులు అనారోగ్యం పబ్లిక్‌గానే జరిగాయి

చాలా కాలం తర్వాత ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తుంది హీరోయిన్ సమంత. కొన్నాళ్లపాటు మయోసైటిస్ కారణంగా సినిమాలకు దూరంగా ఉన్న సామ్... ఇప్పుడు నిర్మాతగా మారి పలు చిత్రాలు నిర్మిస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. విడాకులు, అనారోగ్యం, ట్రోలింగ్స్ పై స్పందించారు. సమంత.. చాలా కాలం తర్వాత తిరిగి సినిమాల్లో యాక్టివ్ అయ్యారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఆసక్తికర కామెంట్స్ చేశారు. సామ్ మాట్లాడుతూ.. "నా జీవితంలో జరిగిన ప్రతి చిన్న విషయం అందరికీ తెలుసు. ఏది జరిగినా అది ప్రజల సమక్షంలోనే జరిగింది. విడాకుల విషయంలో కానీ, ఆరోగ్యం విషయం కానీ అన్ని పబ్లిక్ గానే జరిగాయి. సమంత.. చాలా కాలం తర్వాత తిరిగి సినిమాల్లో యాక్టివ్ అయ్యారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఆసక్తికర కామెంట్స్ చేశారు. సామ్ మాట్లాడుతూ.. "నా జీవితంలో జరిగిన ప్రతి చిన్న విషయం అందరికీ తెలుసు. ఏది జరిగినా అది ప్రజల సమక్షంలోనే జరిగింది. విడాకుల విషయంలో కానీ, ఆరోగ్యం విషయం కానీ అన్ని పబ్లిక్ గానే జరిగాయి. నేను ఎంతో స్ట్రగుల్ ఫేస్ చేశాను. ఆ సమయంలో సోషల్ మీడియాలో నాపై ఎన్నో ట్రోల్స్ వచ్చాయి. ఎవరికి నచ్చినట్లు వాళ్లు నా గురించి జడ్జిమెంట్స్ ఇచ్చారు. అథెంటిసిటీ అనేది ఓ గమ్యస్థానంగా నేను భావించడం లేదు. ఇది కొనసాగుతూనే ఉంటుంది. నా జీవితంలో ప్రతీది సెట్ కాలేదు. కానీ దాని గురించి నేను మాట్లాడుతున్నాను. నేను ఎంతో స్ట్రగుల్ ఫేస్ చేశాను. ఆ సమయంలో సోషల్ మీడియాలో నాపై ఎన్నో ట్రోల్స్ వచ్చాయి. ఎవరికి నచ్చినట్లు వాళ్లు నా గురించి జడ్జిమెంట్స్ ఇచ్చారు. అథెంటిసిటీ అనేది ఓ గమ్యస్థానంగా నేను భావించడం లేదు. ఇది కొనసాగుతూనే ఉంటుంది. నా జీవితంలో ప్రతీది సెట్ కాలేదు. కానీ దాని గురించి నేను మాట్లాడుతున్నాను. నేనేమి పర్ఫెక్ట్ కాదు. ఒప్పుకుంటాను. నేను కూడా చాలా తప్పులు చేశాను. వాటి నుంచి గుణపాఠం నేర్చుకుంటున్నాను. కానీ ఇప్పుడు నేను బెటర్ గా ఉండటానికి ప్రయత్నిస్తున్నాను అంటూ సమంత

# టాలీవుడ్‌లోకి విక్రమ్ తనయుడు



కోలీవుడ్ ఇండస్ట్రీలో అత్యధిక డిమాండ్ ఉన్న హీరోలలో చియాన్ విక్రమ్ ఒకరు. హీరోయిజం చిత్రాలు కాకుండా కంటెంట్ ప్రాధాన్యత ఉన్న సినిమాలు ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. ఇప్పటివరకు తమిళంతోపాటు తెలుగులోనూ ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్న విక్రమ్.. ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉంటున్నారు. మరోవైపు విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ సైతం ఇండస్ట్రీలో హీరోగా తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. తమిళంలో వర్మ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు ధృవ్ విక్రమ్. తొలి చిత్రంతోనే నటుడిగా తానేంటో నిరూపించుకున్నాడు. కానీ కమర్షియల్ గా ఈ సినిమా అంత సక్సెస్ కాలేదు. నటుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు ధృవ్. ఆ తర్వాత తన తండ్రితో కలిసి మహాన్ చిత్రంలో నటించారు. ఈ మూవీ నేరుగా ఓటీటీలో విడుదలై మంచి రివ్యూస్ అందుకుంది. ఇక ఇప్పుడు హీరోగా బైసన్ సినిమాతో హిట్టు కొట్టాడు. సరైన కథ.. దర్శకుడి చేతిలో పడితే తన సత్తా చాటగలనని బైసన్ సినిమాతో నిరూపించుకున్నాడు ధృవ్. మారీ సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన బైసన్ సినిమా దీపావళి పండగ సందర్భంగా శుక్రవారం అడియన్స్ ముందుకు వచ్చింది. కబడ్డీ క్రీడ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ మూవీ విడుదలకు ముందే మంచి బజ్ క్రియేట్ చేసుకుది. డైరెక్టర్ పా. రంజిత్ సొంత నిర్మాణ సంస్థ నీలం ప్రొడక్షన్స్, అప్లాజ్ ఎంటర్టైన్మెంట్, శాంతి సినిమా సంస్థలు కలిపి ఈ సినిమాను నిర్మించగా.. శుక్రవారం విడుదలైన ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. విడుదలైన మొదటి రోజే సూపర్ హిట్ టాక్ అందుకుంది. అత్యున్నత పురస్కారం అర్జున్ అవార్డును గెలుచుకునే స్థాయికి ఎలా ఎదిగాడు అనేదే బైసన్ చిత్రం. ఇందులో ధృవ్ విక్రమ్ హీరోగా, అతడి అక్కగా రజిషా విజయన్, తండ్రి పశుపతి, కథానాయికగా అనుపమ పరమేశ్వరన్ నటించారు. వీరితోపాటు అమీర్, లాల్ ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి కే.ప్రసన్న అందించిన మ్యూజిక్ మరో హైలెట్. ఈ సినిమాలో తనదైన నటనతో పాత్రకు ప్రాణం పోశారు ధృవ్ విక్రమ్. ఇక ఇప్పుడు బైసన్ సినిమాను తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు సిద్ధమయ్యారు మేకర్స్. అదే పేరుతో తెలుగులో అక్టోబర్ 24న విడుదల చేయనున్నారు. అంతకుముందు మారీ సెల్వరాజ్ తెరకెక్కించిన మామన్నన్, కర్ణన్, వాజై చిత్రాలు తెలుగులో విడుదలై మంచి విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు బైసన్ సైతం తెలుగులో సూపర్ హిట్ కావడం ఖాయమని అంటున్నారు

# మహేశ్ బాబుతో రాజమౌళి మైథికల్ అడ్వేంచర్

ప్రపంచ సినీ వేదికపై తెలుగు సినిమాకి కొత్త పుంతలు తొక్కించిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి. 'బాహుబలి' సిరీస్‌తో భారత సినిమాను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టారు. 'ఆర్ఆర్ఆర్'తో ఆస్కార్ దక్కేలా చేశారు. ఇక ఇప్పుడు సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి మరొక భారీ ప్రాజెక్ట్‌కి సిద్ధమవుతున్నారు. గా పిలుస్తున్న ఈ సినిమా భారత సినీ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కనుందని ఇండస్ట్రీ టాక్. దుర్గా ఆర్ట్స్ పతాకంపై ఎస్.గోపాల్‌రెడ్డి ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి టెక్నీషియన్లు, యాక్షన్ స్టంట్ మాస్టర్స్, మరియు టాప్‌నాచ్ ఆర్టిస్టులు ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతు న్నారు. రాజమౌళి గ్లోబల్ మార్కెట్‌పై దృష్టి సారించి, హాలీవుడ్ ప్రొడక్షన్ సంస్థలతో టైఅప్ లను కూడా ఫైనలైజ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రపంచ ప్రఖ్యాత వార్నర్ బ్రదర్స్‌తోనూ చర్చలు కొనసాగుతున్నాయట. అడ్వెంచర్ యాక్షన్ డ్రామా జానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు ఓ "గ్లోబల్ ఎక్స్‌ప్లోరర్" పాత్రలో కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరియు నటుడు మాధవన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఆఫ్రికా అడవులు, దక్షిణ అమెరికా అమెజాన్ బేసిన్, ఐస్‌లాండ్ వంటి విభిన్న లొకేషన్లలో చిత్రీకరణ జరగగా, యూనిట్ ప్రస్తుతం తదుపరి షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ఇక ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిగ్ అప్‌డేట్ కోసం కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తాజా సమాచారం ప్రకారం, నవంబర్ 16న రాజమౌళి " టైటిల్ మరియు ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయాలని నిర్ణయించారట. ఈ అప్‌డేట్‌ను హాలీవుడ్ స్థాయిలో ప్లాన్ చేసిన ఓ గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. అందులోనూ మరో సెన్సేషన్ ఏమిటంటే ఆ ఈవెంట్‌కి "అవతార్" దర్శకుడు జేమ్స్ కామెరూన్ హాజరయ్యే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్. ప్రమోషన్ కోసం ఇండియాకు రానున్న కామెరూన్‌తోనే గ్లోబల్ లెవల్‌లో ఈ అప్‌డేట్ విడుదల చేయించాలనే రాజమౌళి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఈ గ్లింప్స్ ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా హైప్‌కి కొత్త మైలురాయి అవుతుంది అంటున్నారు. మొత్తం మీద, ""తో మహేశ్ బాబు, రాజమౌళి కాంబినేషన్ మరోసారి ఇండియన్ సినిమాను ఇంటర్నేషనల్ రేంజ్‌కి తీసుకెళ్లనుందనే నమ్మకం పెరిగింది




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613